# మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

సంపుటి : 6 | సంచిక : 166 | పేజీలు : 8 | వెల : రూ.2/- ఆదివారం 12 జులై 2026 | వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## ఫార్చ్యూన్ జాబితాలో నారా బ్రహ్మణి

**మోస్ట్ పవర్‌ఫుల్ విమెన్ 2026 అవార్డు అందచేత**

**అభినందనలు తెలిపిన చంద్రబాబు, నారా లోకేశ్**




## ప్రముఖ సింగర్ జానకి కన్నుమూత



**హైదరాబాద్,మన జనప్రగతి జూలై 11:** ప్రముఖ సింగర్ ఎస్. జానకి శనివారం కన్నుమూశారు. మైసురులోని తన నివాసంలో ఆమెకు కార్డియక్ అరెస్ట్ జరగడంతో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె తుదిశ్వాస మిగతా2లో...

## పవన్ కళ్యాణ్ భుజానికి శస్త్ర చికిత్స

**ముంబైలో ప్రఖ్యా వైద్యుల సమక్షంలో ఆపరేషన్**

**ప్రకటన విడుదల చేసిన డిప్యూటి సిఎం కార్యాలయం**



**అమరావతి,మన జనప్రగతి జూలై 11:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు శనివారం ముంబైలోని ఓ ఆస్పత్రిలో భుజానికి విజయవంతంగా శస్త్రచికిత్స జరిగింది. ఈ మేరకు డిప్యూటీ సీఎం కార్యాలయ అధికారులు ఎక్స్‌లో మిగతా2లో...

## పిల్లలే మన నిజమైన సంపద

# జనాభా నియంత్రణ కాదు..

● జనాభా సంరక్షణ నినాదం రావాలి ● దక్షిణాదిలో జనాభా తగ్గడం ఆందోళనకరం ● ప్రపంచ జనాభా దినోత్సవంలో చంద్రబాబు

**విజయవాడ,మన జనప్రగతి జూలై 11:** జనాభా నియంత్రణ కాదు.. జనాభా సంరక్షణ నినాదం రావాలని సీఎం చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు జనాభా తగ్గాలని అందరం కోరుకున్నామని, ఇద్దరికంటే ఎక్కువ మంది ఉంటే స్థానిక సంస్థల్లో పోటీకి అనర్హులని చెప్పామని అన్నారు. కానీ, ఇప్పుడు పరిస్థితులు మారుతు న్నాయని తెలిపారు. పిల్లలే సంపద అనే మాటను నిజం చేస్తామన్నారు. విజయవాడలో నిర్వహించిన ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమంలో చంద్రబాబు ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా జనాభా తగ్గిపోతోంది. యువత ఆశలు, ఆకాంక్షలను సాకారం చేయాలి. ఆడపిల్లలు ఇప్పుడు ఇంటికి భారం కాదు.. ఆస్తి. ఐటీ చదువుకోవాలని గతంలో ఆడపిల్లలను ప్రోత్సహించా. వరకట్నం కాదు.. ఆడపిల్లలకే ఎదురుకట్నం ఇచ్చే పరిస్థితి వచ్చింది. పిల్లలు వద్దనుకునే దంపతులు పెరగడం దురదృష్టకరం అన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఏటా జనాభా తగ్గిపోతోంది. నగరాలు, అర్బన్ ప్రాంతాల్లో జనాభా బాగా తగ్గిపోతోంది. పిల్లల సంఖ్య తగ్గి.. వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. ఇంట్లో పెద్దలు లేకపోతే మిగతా2లో...





## వియత్నాంలో ఘోర ప్రమాదం

**పర్యాటక బోటు బోల్తా పడి 19మంది జలసమాధి**

**పలువురు పరిస్థితి విషమం..ఆస్పతక్రిలో చికిత్స**

**విహార యాత్రకు వెళ్లిన తెలుగువాలో పలువురు మృతి**

**మృతుల్లో కడప, మచిలీపట్నలంకు చెందిన వారు**

**రంగంలోకి దిగిన భారత ఎంబసీ..హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు**

**హనోయ్,మన జనప్రగతి జూలై 11:** వియత్నాంలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఫు క్వాక్ ద్వీపం సమీపంలో భారతీయ పర్యాటకులతో వెళ్తున్న బోటు మిగతా2లో...

## భారత్-న్యూజిలాండ్ బంధం మరింత బలోపేతం

**ఈ ప్రయాణం ముున్ముందు మరింత విజయవంతమవుతుంది**

**ప్రవాస భారతీయులు కృషి ఇందుకు ప్రధాన కారణం**

**న్యూజిలాండ్ పర్యటనలో ప్రవాస భారతీయులతో మోడీ**




## పరిశోధనలు,ఆవిష్కరణలు, స్టార్టప్‌లపై దృష్టి

● యువతకు గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపు


● గురజాడ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో పట్టాలు పంపిణీ



**విశాఖపట్టణం,మన జనప్రగతి జూలై 11:** యువత పరిశోధనలు, ఆవిష్కరణలు స్టార్టప్‌ల వైపు అడుగులు వేయాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో ఏయూ కన్వెన్షన్ హాల్లో జేఎన్టీయూ గురజాడ విశ్విద్యాలయం ప్రథమ స్నాతకోత్సవం జరిగింది. 2023, 2024, 2025 విద్యా సంవత్సరాలకు చెందిన ఉత్తీర్ణులైన విద్యార్థులకు పట్టాలు, ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు, ఎండోమెంట్ అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఏపీ గవర్నర్ నజీర్, వీసీ వీవీ.సుబ్బారావు, నిర్మాణ్ ఆర్గనైజేషన్ సీఈఓ మయూర్ పట్నాల, వివిధ యూనివర్శిటీల వీసీలు, రిజిస్ట్రార్లు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రసంగించారు. విద్యార్థులు కేవలం డిగ్రీలకే పరిమితం కాకూడదని గవర్నర్ వ్యాఖ్యానించారు. మారుతున్న సాంకేతికతకు మిగతా2లో...

## ఉద్యోగుల సమస్యల పరిష్కానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఈనెల 21న మరో సారి సమావేశం
- ఏపి జేపసీ అమరావతి ఉద్యోగ సంఘాల నేతలతో సమావేశం
- రాష్ట్ర మంత్రులు కొలుసు పార్ధసారధి,అనగాని సత్యప్రసాద్ వెల్లడి



**అమరావతి,మన జనప్రగతి జూలై 11:** రాష్ట్రంలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం పూర్తి సానుకూలంగా ఉందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు,గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్ధసారధి,రాష్ట్ర రెవెన్యూ,రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖామాత్యులు అనగాని సత్యప్రసాద్ లు స్పష్టం చేశారు.ఎపి సచివాలయంలో ఎపి జెఎసి అమరావతి ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో శనివారం ఇరువురు మంత్రుల నేతృత్వంలో సమావేశమై ఉద్యోగులకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రాధమికంగా చర్చించారు. ఈసమావేశం అనంతరం మంత్రులు ఇరువురు మీడియాతో మాట్లాడగా ముందుగా మంత్రి పార్ధసారధి మాట్లాడుతూ ఈసమావేశంలో రాష్ట్ర ఆర్ధిమంత్రి వర్యులు పయ్యావుల కేశవ్ హాజరు కావాల్సి ఉండగా ముందస్తు కార్యక్రమాలు మూలంగా ఆయన రాలేకపోయారని స్పష్టం చేశారు.గత ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పట్టించుకోకుండా సమస్యలను ప్రక్కన పెట్టడంతో ఈసమస్య వచ్చిందని పేర్కొన్నారు.ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మొత్తం 23 డిమాండ్లను ఇవ్వడం జరిగిందని వాటన్నిటినీ మంత్రులు మిగతా2లో...



## భారత్ లక్ష్యం యుద్ధం కాదు ప్రపంచ శాంతి, స్థిరత్వమే మా విధానం

**భద్రతకు ముప్పు వాటిల్లినందునే ఆపరేషన్ సిందూర్**

**అత్యాధునిక యుద్ధ నౌక ఐఎన్‌ఎస్ మహేంద్రగిరి జాతికి అంకితం**

**కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టీకరణ**

**విశాఖపట్నం,మన జనప్రగతి జూలై 11:** భారత్ లక్ష్యం యుద్ధం కాదని, ప్రపంచ శాంతి, స్థిరత్వమే తమ విధానమని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఆపరేషన్ సింధూర్ యుద్ధం కాదని, భారత భద్రతకు ముప్పు వాటిల్లితే దేశం ఎలా స్పందిస్తుందో ప్రపంచానికి చూపించిన చర్య అని వ్యాఖ్యానించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సముద్ర భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని, భారత్ వ్యతిరేక శక్తులకు అవసరమైన సమయంలో తగిన సమాధానం ఇస్తామని రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. భారత నౌకాదళంలో అత్యాధునిక యుద్ధ నౌక ఐఎన్‌ఎస్ మహేంద్రగిరి చేరడం దేశ భద్రతకు మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో ఐఎన్‌ఎస్ మహేంద్రగిరిని జాతికి అంకితం చేసిన ఆయన.. ఇది భారత నౌకాదళ శక్తిని మరింత పెంచే మిగతా2లో...

## సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో మున్సిపల్ ఎన్నికలు

**- పురపాలక శాఖ మంత్రి నారాయణ వెల్లడి**



**భీమవరం,మన జనప్రగతి జూలై 11:** సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఈ ఎన్నికలు జరపడానికి సీఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ మిగతా2లో...

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
12 - 07 - 2026

# పవన్ కళ్యాణ్ భుజానికి శస్త్ర చికిత్స

(మొదటి పేజీ తరువాయి)

పోస్ట్ పెట్టారు. ప్రపంచ ప్రఖ్యాత ఆర్థోపెడిక్ సర్జన్, స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణుడు డాక్టర్ దిన్‌షా పార్థివాలా నేతృత్వంలోని వైద్యుల బృందం ఈ శస్త్రచికిత్సను నిర్వహించారని తెలిపారు. పవన్ కల్యాణ్‌కు రెండు భుజాల్లోనూ తీవ్రమైన రోటేటర్ కఫ్ గాయాలు ఉన్నట్లు నిర్ధారించారని చెప్పారు. రోటేటర్ కఫ్ చిరగడంతో పాటు, ఆయన కుడి భుజంలో అవల్షన్ ఫ్రాక్చర్ ఏర్పడటంతో ఓ పెద్ద శస్త్రచికిత్స అవసరమైందని అన్నారు. ఆయన కుడి భుజానికి చేసిన ఈ శస్త్రచికిత్స సుమారు మూడున్నర గంటల పాటు కొనసాగించారని.. ఈ సర్జరీ విజయవంతంగా పూర్తయిందని అధికారులు తెలిపారు. పవన్ కల్యాణ్‌ను ఆపరేషన్ అనంతరం రికవరీ గదికి తరలించారని అధికారులు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి అనస్థీషియా ప్రభావం నుంచి బాగా కోలుకుంటున్నారని చెప్పారు. చికిత్స అందిస్తున్న వైద్య బృందం నిశిత పర్యవేక్షణలో డిప్యూటీ సీఎం ఉన్నారని వెల్లడించారు. వీలైనంత త్వరగా శస్త్రచికిత్స చేయించుకోవాలని వైద్య నిపుణులు సలహా ఇచ్చారని అన్నారు. ముందుగా తన అధికారిక కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని, పవన్ కల్యాణ్ శస్త్రచికిత్స చేయించుకోవడానికి ముందే వాటిని పూర్తి చేయాలని నిర్ణయించారని చెప్పారు. రెండు భుజాలకు ఒకేసారి శస్త్రచికిత్స చేయడంతో ఆపరేషన్ తర్వాత గణనీయమైన అసౌకర్యం, కదలిక పరిమితి ఏర్పడే అవకాశం ఉందని చెప్పారు. ఈ క్రమంలో వైద్య బృందం మొదట కుడి భుజానికి శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించిందని డిప్యూటీ సీఎం కార్యాలయ అధికారులు పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ తగినంత కోలుకున్న తర్వాత ఎడమ భుజానికి శస్త్రచికిత్స చేయాలని ప్రణాళిక చేశారని అధికారులు తెలిపారు. ఆయన అవిశ్రాంత ప్రజా కార్యక్రమాలు, విస్తృత రాజకీయ పర్యటనలు, ఎన్నికల ప్రచారాలు, పార్టీ కార్యకర్తలు, శ్రేయోభిలాషులతో నిరంతర సంభాషణల కారణంగా, 2016లో అయిన ఈ భుజం గాయాలు సంవత్సరాలు గడిచేకొద్దీ క్రమంగా తీవ్రమయ్యాయని వెల్లడించారు. నిరంతర నొప్పిని భరిస్తున్నప్పటికీ, ఉప ముఖ్యమంత్రి ఎలాంటి అంతరాయం లేకుండా తన అధికారిక బాధ్యతలను నిర్వర్తిస్తూ, ప్రజా కార్యక్రమాల్లో పాల్గొంటూనే ఉన్నారని అన్నారు. పవన్ కల్యాణ్ కోలుకోవడానికి సంబంధించిన మరిన్ని వివరాలు తగిన సమయంలో తెలియజేస్తామని డిప్యూటీ సీఎం కార్యాలయ అధికారులు పేర్కొన్నారు.

# పిల్లలే మన నిజమైన సంపద.. జనాభా నియంత్రణ కాదు..

(మొదటి పేజీ తరువాయి)

పిల్లల పెంపకంలో అనేక ఇబ్బందులు వస్తాయి. పిల్లలే మన రాష్ట్ర సంపద.. వారితోనే ఆర్థిక ప్రగతి. సరిపడా జనాభా లేకుంటే అనేక సమస్యలు వస్తాయని హెచ్చరించారు. పిల్లల్ని పెంచే బాధ్యతను తండ్రి కూడా తీసుకోవాలి. ఇంటిపని, వంటపని అనే తేడా లేదు. అన్నింట్లోనూ మగవాళ్లు సాయం చేయాలి. సంజీవిని కింద డిజిటల్ ఆరోగ్య రికార్డులు తీసుకుంటున్నాం. మెంటల్ సిక్‌నెస్ అతిపెద్ద సమస్యగా తయారైంది. సోషల్ మీడియా వల్ల మానసిక సమస్యలు పెరుగుతున్నాయి. విలువైన సమయం వృథా చేసుకుంటున్నారు. నేటి యువత యోగా, ధ్యానం అలవరచుకోవాలని సూచించారు. 60 ఏళ్లు దాటాక సమాజం కోసం పని చేయాలి. జీవితాంతం నేర్చుకుంటూనే ఉండాలి. నైపుణ్యాలు పెంచుకోవాలి. నియంత్రణ లేకుంటే ఏ టెక్నాలజీ అయినా ప్రమాదమే. ప్రతి ఒక్కరూ జీవితాన్ని సరిగా ప్లాన్ చేసుకోవాలి. జనాభా తగ్గిపోతే అనుకున్న లక్ష్యాలు సాధించలేం. 2040కే స్వర్ణాంధ్ర సాధించుకునే సత్తా మనకుందని చంద్రబాబు అన్నారు.ప్రపంచ జనాభా దినోత్సవం 2026 చరిత్రలో నిలిచిపోతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. విజయవాడలోని అంబేద్కర్ కళావేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమశాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆసక్తిగా తిలకించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి వైద్యులు, వైద్య కళాశాలకు చెందిన విద్యార్థులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. నేడు ప్రపంచంలో ఎక్కడ చూసినా అత్యధిక ఆదాయం సంపాదించేవారు తెలుగువారేనని తెలిపారు. ఆరోజు ఐటీ గురించి మాట్లాడానని.. ఈరోజు ఏఐ గురించి మాట్లాడుతున్నానని చెప్పారు. ఆనాడు తల్లిదండ్రులు ఆడపిల్లలను చదివించాలంటే చాలా ఆలోచన చేసే వారని పేర్కొన్నారు. ఆనాడు త్వరగా పెళ్లిళ్లు చేసి అత్తగారింటికి పంపిస్తే బాధ్యత అయిపోతుందని అనుకునేవారని సీఎం చంద్రబాబు చెప్పారు. అప్పుడు మగపిల్లలకు పోటీగా ఆడపిల్లలు ఎదగాలని బాగా చదివించాలని చెప్పానని గుర్తుచేశారు. ఉద్యోగాల్లో, కాలేజీల్లో 33 శాతం రిజర్వేషన్లు కూడా ప్రవేశపెట్టామని తెలిపారు. అప్పుడు వరకట్నం ఉండేదని.. ఇప్పుడు ఎదురు కట్నం వచ్చిందని ప్రస్తావించారు. ఆడపిల్లలే ఎదురు కట్నం తీసుకునే పరిస్థితి వచ్చిందని తెలిపారు. నేడు భర్తల కన్నా భార్యల ఆదాయం ఎక్కువగా ఉందని వివరించారు. తనకన్న తన సతీమణి ఆదాయం, తన కొడుకు కంటే.. తన కోడలు ఆదాయమే ఇప్పుడు ఎక్కువగా ఉందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# వియత్నాంలో ఘోర ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ఒక్కసారిగా తీవ్రమైన అలలకు బోల్తా పడింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు 19 మంది తెలుగు పర్యాటకులు జలసమాధి అయ్యారు. వెంటనే రంగంలోకి దిగిన సహాయ బృందాలు రక్షణ చర్యలు చేపట్టారు. స్థానిక అధికారులతో కలిసి నేవీ సిబ్బంది సహాయ చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఇందులో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. భారత కాలమాన ప్రకారం ఉదయం 11: 30 గంటలకు బోటు ప్రమాదం జరిగినట్లుగా తెలుస్తోంది. ఓ మొబైల్ కంపెనీ తరపున డీలర్స్ టూరిస్ట్‌లుగా వెళ్లారు. ఏపీ నుంచి 30, తెలంగాణ నుంచి 45 మంది వెళ్లారు. ప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ కూడా లైఫ్ జాకెట్లు వేసుకోలేదని తెలుస్తోంది. ఇక మృతుల వివరాల కోసం అధికారులు హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేశారు. బాధిత కుటుంబాలు కంట్రోల్ రూమ్‌లను సంప్రదించవచ్చని, ఎలాంటి సహాయానికైనా, సందేహాలకైనా తాము అందుబాటులో ఉన్నామని భారత మిషన్ తెలిపింది. మొత్తం బోటులో 75 మంది భారతీయులు ఉండగా.. ఎక్కువగా తెలుగు రాష్ట్రాలకు చెందినవారు, తమిళనాడు వాసులు చనిపోయినట్లుగా తెలుస్తోంది. అయితే వారి పూర్తి వివరాలు, స్వస్థలాలు, కుటుంబ సభ్యుల సమాచారం సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. భారత రాయబార కార్యాలయం కూడా వియత్నాం అధికారులతో సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. బోటు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులా, సాంకేతిక లోపమా, లేక మరే ఇతర కారణమా అన్న కోణంలో అధికారులు విచారణ చేపట్టారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక దర్యాప్తు అనంతరం వెల్లడికానున్నాయి. ఈ విషాద ఘటనతో మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. తెలుగు రాష్ట్రాల్లోని బంధువులు, స్నేహితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాలను స్వదేశానికి తరలించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఈ విషయాన్ని వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం అధికారికంగా ధ్రువీకరించింది. ప్రస్తుతం స్థానిక అధికారులు ఘటనా స్థలంలో ముమ్మరంగా గాలింపు, సహాయక చర్యలు చేపడుతున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన కచ్చితమైన వివరాలు, బోటులో మొత్తం ఎంతమంది పర్యాటకులు ఉన్నారు.. వారి ప్రస్తుత పరిస్థితి ఏమిటన్నది ఇంకా పూర్తిగా తెలియరాలేదు. ఈ ఘటనపై భారత రాయబార కార్యాలయం సామాజిక మాధ్యమం 'ఎక్స్ లో స్పందిస్తూ.. 'ఓ విషాదకరమైన ఘటనలో, కొన్ని గంటల క్రితం వియత్నాంలోని ఫు క్వాక్ ద్వీపం సమీపంలో పలువురు భారతీయ పర్యాటకులతో వెళ్తున్న బోటు బోల్తాపడింది. స్థానిక అధికారులు రెస్క్యూ ఆపరేషన్లు కొనసాగిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నాం' అని పేర్కొంది. ప్రమాదానికి గురైన పర్యాటకుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు, అవసరమైన సహాయం చేయడానికి భారత ప్రభుత్వం వియత్నాంలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటుచేసింది. ప్రమాద సమయంలో బోటులో సుమారు 30 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన సుమారు 18 మంది మరణించినట్లు సమాచారం. కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కిషోర్ కుటుంబం కూడా ఈ విహారయాత్రలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో కిషోర్ భార్య మరణించగా, అపస్మారక స్థితిలోకి వెళ్లిన కిషోర్‌ను స్థానిక ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. స్థానిక అధికారుల సహాయక చర్యలు పూర్తిగా ముగిసిన అనంతరం ఈ వివరాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కడప జిల్లాకు చెందిన డిస్ట్రిబ్యూటర్ శ్రీధర్, మచిలీపట్నంకు చెందిన జయశ్రీ మరణించారు. కడపకు చెందిన మరో డిస్ట్రిబ్యూటర్ నయీం ఒడ్డున ఉండటంతో ప్రాణాలు దక్కించుకున్నారు. ట్రిప్‌లో భాగంగా వీరు మూడు పడవల్లో సముద్రంలో విహార యాత్రకు వెళ్లారు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో హాన్ మే రుట్ నుంచి అన్‌థోయ్ పోర్టుకు ఒక స్పీడ్ బోట్ బయల్దేరింది. అందులో 32 మంది భారతీయులు, నలుగురు సిబ్బంది ఉన్నారు. ఈ పడవ తీరానికి 400 మీటర్ల దూరంలో ఉండగా.. సముద్రంలో ఒక్కసారిగా బోల్తా పడింది. దీంతో ప్రయాణికులు నీటిలో మునిగి పోయారు. ప్రమాదం జరిగిన వెంటనే గమనించిన సమీపంలోని ఇతర పర్యాటక బోట్ల నిర్వాహకులు.. అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే, బోటు పూర్తిగా తలకిందులు కావడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. అటు అలల ఉధృతి కూడా తీవ్రంగా ఉండటంతో టూరిస్టులను కాపాడటం కష్టంగా మారింది. వీరిలో కొందరిని రెస్క్యూ సిబ్బంది రక్షించి ఆసుపత్రికి తరలించారు. మరికొందరు గల్లంతవ్వగా వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

# భారత్-న్యూజిలాండ్ బంధం మరింత బలోపేతం

**ఆక్లాండ్,మన జనప్రగతి జూలై 11:** భారత్-న్యూజిలాండ్ వాకా(బోటు) ఇప్పుడు నూతన ప్రయాణాన్ని ఆరంభిం చేందుకు సిద్ధంగా ఉందని, ఇరు దేశాల మధ్య భాగస్వామ్యం మరింత బలోపేతం కానుందని భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రయాణం ముమ్ముందు మరింత విజయవంతమవుతుందనే పూర్తి నమ్మకం తనకుందన్న మోదీ.. అది తనవల్ల కాదని, అందుకు న్యూజిలాండ్‌లోని భారతీయులే కారణమన్నారు. న్యూజిలాండ్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ రెండో రోజు పర్యటన కొనసాగింది. శనివారం ఆక్లాండ్‌లో ఆయన ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు స్నేహం, విశ్వాసం, విలువలు, బలమైన భవిష్యత్తు కోసం పరస్పర నిబద్ధతపై నిర్మితమయ్యా యని ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు మోదీ. న్యూజిలాండ్ సంప్రదాయంలో విశిష్ట స్థానం కలిగిన 'వాకా'ను గురించి ప్రస్తావిస్తూ.. 'అదో పడవ మాత్రమే కాదని, ఉమ్మడి ప్రయాణానికి చిహ్నం' అని పేర్కొన్నారు. ఆక్లాండ్ నుంచి వెల్లింగ్టన్ వరకు, క్రైస్ట్‌చర్చ్ నుంచి క్వీన్స్‌టౌన్ వరకు విస్తరించి ఉన్న భారతీయ సమాజమే ఈ స్వర్ణయుగ ప్రయాణానికి నిజమైన నావికులని కొనియాడారు. భారతీయుల ప్రతిభను గుర్తించి సరైన అవకాశాలు కల్పించే అద్భుత దేశం న్యూజిలాండ్ అని అన్నారు. ఎయిర్ న్యూజిలాండ్ సీఈఓగా నిఖిల్ రవిశంకర్, గవర్నర్ జనరల్‌గా ఆనంద్ సత్యానంద్, క్రికెట్‌లో రచిన్ రవీంద్ర, ఇష్ సోధి, అజాజ్ పటేల్ వంటి భారత సంతతి వ్యక్తులు రాణించడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. అలాగే ఆ దేశంలోని పలు ప్రాంతాలకు బాంబే హిల్స్, కోరమాండల్, కలకత్తా స్ట్రీట్, ఢిల్లీ క్రెసెంట్, అమృత్‌సర్ స్ట్రీట్ వంటి భారతీయ పేర్లుండటాన్ని ఇరు దేశాల మధ్య ఉన్న అనుబంధానికి సంకేతమని పేర్కొన్నారు. ఈ దేశంతో తనకు 30 ఏళ్ల అనుబంధం ఉందని గుర్తుచేసిన మోదీ.. రాజకీయాల్లోకి రాకముందే న్యూజిలాండ్‌ను సందర్శించే అవకాశం వచ్చిందని చెప్పారు. నాడు ఓ న్యూజిలాండ్ వాసి తనకు మఫ్లర్, టోపీ, గ్లౌజులు కానుకగా ఇచ్చిన విషయాన్ని స్మరించుకున్నారు. ఆ మఫ్లర్‌ను ఇప్పటికీ జాగ్రత్తగా భద్రపరుచుకున్నానని, అందులో న్యూజిలాండ్ దేశీయుల ప్రేమనూ అంతే ఆప్యాయంగా కాపాడుకుంటున్నట్టు చెప్పుకొచ్చారు.

# పరిశోధనలు,ఆవిష్కరణలు, స్టార్టప్‌లపై దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

అనుగుణంగా ఉపాధి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని దిశానిర్దేశర చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటాసైన్స్, రోబోటిక్స్ వంటి సాంకేతికతను సమాజ శ్రేయస్సు కోసం ఉపయోగించాలని మార్గనిర్దేశర చేశారు. విద్యార్థులను ప్రపంచస్థాయి పౌరులుగా తీర్చిదిద్దడంలో అధ్యాపకులు, విద్యాసంస్థలదే కీలక పాత్ర అని తెలిపారు. జేఎన్‌టీయూ జేవీ క్యాంపస్‌లో ఉన్నత విద్యా ప్రమాణాలతో విద్యాబోధన అందిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. క్యాంపస్‌లో జల సంరక్షణ పటిష్ఠంగా అమలు చేస్తున్నారని గవర్నర్ కొనియాడారు. సింగిల్ యూజ్ ఎలాస్టిక్‌ను నిషేధించడం, క్యాంపస్ అంతటా ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని ప్రోత్సహించడం ద్వారా యూనివర్శిటీని 'నెట్ జీరో క్యాంపస్'గా మార్చేందుకు కృషి చేస్తున్నారని కితాబు ఇచ్చారు. సమ్మర్ ఇంటర్న్‌గా సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు హాస్టల్ బిల్డింగ్‌ల రిపేర్లు, రినోవేషన్ పనులను స్వయంగా పూర్తి చేయడం గొప్ప విషయమని ప్రశంసించారు. జాతీయ విద్యా విధానం 2020 ద్వారా సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, నైతిక విలువలతో కూడిన విద్య అందుతుందని గవర్నర్ నజీర్ పేర్కొన్నారు.

# ఫార్చ్యూన్ జాబితాలో నారా బ్రహ్మణి

**అమరావతి,మన జనప్రగతి జూలై 11:** హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణికి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు దక్కింది. ప్రముఖ బిజినెస్ మ్యాగజైన్ 'ఫార్చ్యూన్ ఇండియా' ప్రకటించిన మోస్ట్ పవర్‌ఫుల్ విమెన్ – 2026 జాబితాలో ఆమె చోటు సంపాదించారు. భారతదేశ ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళా పారిశ్రామికవేత్తల జాబితాలో బ్రాహ్మణి నిలవడం విశేషం. దిల్లీలో జరిగిన ఫార్చ్యూన్ ఇండియా 'మోస్ట్ పవర్‌ఫుల్ విమెన్ 2026' సదస్సులో బ్రాహ్మణికి ఈ అవార్డును అందజేశారు. హెరిటేజ్ ఫుడ్స్ ప్రస్థానంలో రైతుల పాత్ర ఎనలేనిదని, పాల ఉత్పత్తిలో నూతన సాంకేతికతను జోడిస్తూనే.. అన్నదాతల జీవనోపాధిని మెరుగుపరచడమే తమ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా బ్రాహ్మణి స్పష్టం చేశారు. ఈ అరుదైన గుర్తింపును హెరిటేజ్ ఫుడ్స్ కుటుంబానికి, రైతులకు, సంస్థ ఉద్యోగులకు అంకిత మిస్తున్నట్లు ప్రకటించారు. తన భార్య సాధించిన ఘనతపై మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఫార్చ్యూన్ ఇండియా ప్రకటించిన 100 మంది అత్యంత ప్రభావవంతమైన మహిళల జాబితాలో బ్రాహ్మణి నిలవడం తమకు ఎంతో గర్వకారణమన్నారు. ఇలాగే ప్రతిభను చాటుతూ, నాయకత్వ లక్షణాలతో మరిన్ని అవరోధాలను అధిగమించాలని ఆకాంక్షించారు. 'ఫార్చ్యూన్ ఇండియా' విడుదల చేసిన 'మోస్ట్ పవర్‌ఫుల్ విమెన్' జాబితాలో నారా బ్రాహ్మణికి చోటు దక్కడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఆమెకు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలిపారు. బ్రాహ్మణి ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో స్థానం సంపాదించడం ఎంతో అభినందనీయమని సీఎం పేర్కొన్నారు. ఇది ఆమె నాయకత్వం, దూరదృష్టి, అంకితభావానికి దక్కిన అరుదైన గుర్తింపని కొనియాడారు. బ్రాహ్మణి సాధించిన ఈ ఘనత యువతులకు, ముఖ్యంగా తెలుగు అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. భవిష్యత్‌లో కూడా బ్రాహ్మణి మరిన్ని విజయాలు సాధిస్తూ, కొత్త మైలురాళ్లను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నట్లు సీఎం చంద్రబాబు తన సందేశంలో తెలిపారు.

# ప్రముఖ సింగర్ జానకి కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

విడిచారు. అనారోగ్యం, వయోభారం కూడా ఆమె మృతికి కారణంగా తెలుస్తోంది. అన్ని భాషలలో కలిపి జానకి 48 వేలకు పైగా పాటలు పాడారు.

"నైటింగేల్ ఆఫ్ సౌత్ ఇండియా" అని ఆమెను పిలుస్తారు.

# సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో మున్సిపల్ ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చారని తెలిపారు. శనివారం పశ్చిమగోదావరి జిల్లాలోని నర్సాపురంలో మంత్రి నారాయణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పట్టణంలో రోడ్లు, డ్రైనేజీలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మంత్రి నారాయణ వెంట ఎమ్మెల్యే నాయకర్, ప్రజాప్రతినిధులు,అధికారులు ఉన్నారు. అనంతరం నర్సాపురం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడారు. గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని వ్యాఖ్యానించారు. గోదావరి పుష్కరాలకు సుమారుగా 10 కోట్ల మంది భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేసిందని తెలిపారు. గత పుష్కరాలకు నాలుగు కోట్ల మంది భక్తులు వచ్చారని పేర్కొన్నారు. ఇప్పటివరకు మున్సిపల్ శాఖకు పుష్కర అభివృద్ధి పనుల నిమిత్తం రూ.150 కోట్లు మంజూరు చేశామని మంత్రి వెల్లడించారు. పుష్కరాలు జరిగే ప్రాంతాల్లో స్పెషల్ ఆఫీసర్ల పర్యవేక్షణలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్నామని చెప్పుకొచ్చారు. త్వరలో శాఖల వారీగా పుష్కర నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. నిధులు లేకపోయినా తమ ప్రభుత్వం పుష్కరాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని పురపాలక సంఘాలకు రూ.1400 కోట్లు యుసీఎఫ్ నిధులు మంజూరు చేశామని వివరించారు. పుష్కరాల నాటికి రోడ్లు, డ్రైన్‌లు, పార్కులు పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని పేర్కొన్నారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా నర్సాపురం మున్సిపాలిటీకి రూ.34 కోట్లు కేటాయించామని ప్రస్తావించారు. కేంద్రం ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పనులు ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. ఏపీకి కేంద్రం రూ.14,000 కోట్లు నిధులు కేటాయించిందని వెల్లడించారు. మరో రూ.16 కోట్లు సీఎం కేటాయించారని అన్నారు. ఈ నిధులతో ఏయే ప్రాజెక్టులు చేపట్టాలనే దానిపై డీపీఆర్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. అమృత్ 2.0 ద్వారా రూ.125 కోట్లతో డ్రింకింగ్ వాటర్ పనులు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. పట్టణంలో రెండు ఎస్‌టీపీలను పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిధులతో నిర్మిస్తున్నామని అన్నారు. జగన్ ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి వెళ్లిపోయిందని విమర్శించారు. అయినా సీఎం చంద్రబాబు కేంద్ర సహకారంతో అభివృద్ధి పనుల కోసం ఎక్కువ నిధులు ఖర్చు చేస్తున్నారని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

(మొదటి పేజీ తరువాయి)

ఇరువురం క్షుణ్ణంగా పరిశీలించడం జరిగిందని ఉద్యోగుల సమస్యల పట్ల ముఖ్యమంత్రి వర్యులు పూర్తి సానుకూలంగా ఉన్నారని అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను కూడా దృష్టిలో ఉంచుకుని అన్ని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగిన ప్రయత్నం చేస్తుందని స్పష్టం చేశారు. ఉద్యోగుల సమస్యలపై చర్చిచేందుకు ఈనెల 21వ తేదీన మరోసారి సచివాలయంలో అన్ని ఉద్యోగ సంఘాలతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రులు ఇరువురూ ప్రకటించారు.ఈలోగా రాష్ట్ర ఆర్థికమంత్రి వర్యులతో కూడా ఉద్యోగ సంఘాల సమస్యలపై మరొక సారి చర్చిస్తామని వారి పేర్కొన్నారు.కావున ఉద్యోగులు వారి ఆందోళన కార్యక్రమాల కార్యాచరణను వాయిదా వేసుకోవాలని మంత్రులిరువురు ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు సూచించారు.రాష్ట్ర రెవెన్యూ మరియు రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖామాత్యులు అనగాని సత్య ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగ సంఘాలతో నిర్వహించిన సమావేశం పూర్తి సహృద్భావ వాతావరణంలో జరిగిందని ఉద్యోగుల సమస్యల పరిష్కరానికి ముఖ్యమంత్రి వర్యులు పూర్తి సానుకూలంగా ఉన్నారని పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వం చేసిన నిర్వాకంతోనే నేడు ఉద్యోగులకు ఈపరిస్థితి వచ్చిందని ఉద్యోగ సంఘాలు ఇచ్చిన 23 డిమాండ్లను పరిశీలించామని వాటన్నిటినీ ఏవిధంగా పరిష్కరించాలనే దానిపై ఈనెల 21న మరో సారి సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు.దానికంటే ముందు రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్ తో చర్చిస్తామని అన్నారు.అవసరమైతే 21వ తేదీ కంటే ముందుగానే ఈ సమావేశాన్ని నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# భారత్ లక్ష్యం యుద్ధం కాదు..ప్రపంచ శాంతి, స్థిరత్వమే మా విధానం

(మొదటి పేజీ తరువాయి)

కీలక అడుగని పేర్కొన్నారు. భారత సముద్ర భద్రతలో విశాఖపట్నం కీలక కేంద్రంగా ఎదిగిందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు దూరదృష్టితో రాష్ట్రంలో ఏరోస్పేస్, రక్షణ రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని ప్రశంసించారు. దేశ రక్షణ సామర్థ్యాన్ని మరింత పెంచే దిశగా అత్యాధునిక సాంకేతికతపై దృష్టి సారించామని తెలిపారు. ఐదో తరం ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ టెక్నాలజీతో పాటు అండర్‌వాటర్ టార్పెడో వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కర్నూలును దేశంలో ప్రముఖ డ్రోన్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అడ్వాన్స్‌డ్ షిప్ టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ, పూర్తి స్థాయి నిఘా వ్యవస్థలతో భారత సాయుధ దళాలను ఆధునీకీకరిస్తున్నామని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. కొత్త సాంకేతికత యుద్ధ అవసరాలకే కాకుండా విపత్తుల సమయంలో ఇతర దేశాలకు సహాయం చేయడంలో కూడా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మారిటైమ్ విజన్-2030 అమలులో భాగంగా సముద్ర రంగ అభివృద్ధికి ప్రత్యేక మారిటైమ్ డెవలప్‌మెంట్ ఫండ్ ఏర్పాటు చేశామని తెలిపారు.భారత రక్షణ, ఏరోస్పేస్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ కొత్త శక్తికేంద్రంగా మారినట్లు ఆయన తెలిపారు. కొత్త టెక్నాలజీలు, సంప్రదాయ విధానాలు ఒకటికి ఒకటి వేరు కాదు అని, ఒకదానిపై ఒకటి ఆధారపడుతాయని, పోటీపడుతాయని, సంప్రదాయ ఎలాట్‌ఫామ్‌లు లేకుండా.. కొత్త టెక్నాలజీ అసంపూర్ణంగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ యుద్ధనౌకలోని 75 శాతానికి పైగా భాగాలు స్వదేశీ సాంకేతికతతో రూపొందించబడ్డాయి.

# జనాభా నిర్వహణపై అవగాహన పెంచుకోవాలి

**• ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా**

**సెట్కూరు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు**




**కర్నూలు మన జనప్రగతి జూలై 11:** ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శనివారం దిన్నదేవరపాడులోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జిల్లా యువజన సంక్షేమ శాఖ సెట్కూరు ఆధ్వర్యంలో జనాభా నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెట్కూరు సీఈఓ డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ, జనాభా నియంత్రణ కంటే జనాభా నిర్వహణపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. మానవ వనరులను సమర్థంగా వినియోగించుకోవడం, వనరుల సమతుల్యతను కాపాడడం, యువశక్తిని పరిరక్షించడం జనాభా నిర్వహణ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాష్ట్రంలో టోటల్ ఫెర్టిలిటీ రేట్ (టీఎఫ్ఆర్) తగ్గుతున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సరైన జనాభా నిర్వహణ విధానాలు అవసరమని పేర్కొన్నారు. జనాభా పెరుగుదలతో పాటు నిరుద్యోగం, పేదరికం, పర్యావరణ సమస్యలు, వనరుల కొరత వంటి సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి నిర్మల, అధ్యాపకులు, సెట్కూరు జూనియర్ అసిస్టెంట్ సంక్రు బాయి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలి



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జులై 11:**-ఎస్ఐఆర్ కార్యక్రమం నిర్దేశించిన గడువులోగా త్వరగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ నూరూల్ కమర్ అన్నారు. శనివారం కర్నూలు జిల్లాలోని కల్లూరు గ్రామ పరిధిలో ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక క్యాంప్ నిర్వహించారు. ఈ ప్రత్యేక క్యాంప్‌లో కల్లూరు పరిధిలోని పోలింగ్ స్టేషన్ నంబర్లు 100 నుండి 120 వరకు సంబంధించిన అన్ని బూత్‌లకు ఒకే కేంద్రంగా ఏర్పాటు చేసిన క్యాంప్‌లో సంబంధిత బీఎల్‌ఓలు హాజరై విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు కూడా క్యాంప్‌కు వచ్చి తమ ఎన్యుమరేషన్ ఫార్మ్‌లు నింపడం జరిగింది. అలాగే ఓటరు జాబితా సవరణలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించి అవసరమైన మార్గదర్శకాలు అందించడం జరిగింది. కార్యక్రమాన్ని కర్నూలు జాయింట్ కలెక్టర్ & ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి నూరూల్ కమర్, అలాగే డిప్యూటీ తహసీల్దార్ అందాల శనివారం పరిశీలించారు. వారు ప్రతి బీఎల్‌ఓ వద్దకు వెళ్లి జరుగుతున్న పనులను పరిశీలించి, ప్రజలకు అందిస్తున్న సేవలు మరియు ఎస్ఐఆర్ ప్రక్రియ అమలు తీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ గారు బీఎల్‌ఓలకు మరణించిన ఓటర్లు, డూప్లికేట్ ఓటర్లు, గుర్తించలేని ఓటర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదే సమయంలో కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వారు, వివరాల్లో మార్పులు లేదా తొలగింపులు కోరుకునే వారి దరఖాస్తులను కూడా నిబంధనల ప్రకారం వెంటనే స్వీకరించి పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలందరికీ ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ యొక్క ప్రాముఖ్యతను వివరించి, అవసరమైన పత్రాలతో ఫార్మ్‌లు సక్రమంగా సమర్పించాలని అవగాహన కల్పించారు. మొత్తం కార్యక్రమం ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా నిర్వహించబడింది.

# లోక్ అదాలత్‌లో 6,403 కేసులు పరిష్కారం



**పత్తికొండ మన జనప్రగతి జూలై 11:-** పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు లో నిర్వహించిన జాతీయాలోపదాలతో 6,403 కేసులు పరిష్కారమైనట్లు న్యాయమూర్తి టీ. జోష్ణ దేవి తెలిపారు. శనివారం స్థానిక న్యాయస్థానంలో నిర్వహించిన ఈ లోక్ అదాలత్ లో సీసీ 58, ఎన్ఐ యాక్ట్ 3, ఎంసి 2, ఓఎస్ 17, ఇపి 17, ఎక్సైజ్ 39, పెట్టి కేసులు 6,267 మొత్తం కలిపి 6,403 కేసులు పరిష్కారం అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు, లోక్ అదాలత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భాకరాపేటలో బస్సుల కోసం గంటల నిరీక్షణ

**• రద్దీతో ఆపని బస్సులు..మహిళలు, వృద్ధులు, చిన్నారులకు తీవ్ర ఇబ్బందులు • సర్వీసులు పెంచాలని ప్రయాణికుల విజ్ఞప్తి**



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 11:**-మండలంలోని భాకరాపేట కూడలిలో శనివారం ఆర్టీసీ బస్సులు సమయానికి రాకపోవడం, కడప నుంచి వచ్చే బస్సులు రద్దీగా ఉండటంతో అక్కడ వేచి ఉన్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా శ్రీశక్తి పథకం కింద ఉచిత ప్రయాణం చేస్తున్న మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఎండ తీవ్రతలో గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తిరుపతి, రాజంపేట, రైల్వే కోడూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు బద్వేల్ వైపు వెళ్లేందుకు భాకరాపేటలో వేచి ఉన్నప్పటికీ, కడప నుంచి వచ్చే బస్సులు అప్పటికే రద్దీగా ఉండటంతో అక్కడ ఆగకుండా వెళ్లిపోతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. భాకరాపేటబద్వేల్ మార్గంలో అదనపు సర్వీసులు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. ఈ విషయంపై బద్వేల్ ఆర్టీసీ డిపో మేనేజర్ కన్యాకుమారి స్పందిస్తూ, డిపోలో బస్సుల కొరత ఉందని, కొత్త బస్సుల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు. కడపబద్వేల్ మార్గంలోని ప్రతి బస్సు భాకరాపేటలో ప్రయాణికులను ఎక్కించుకునేలా చర్యలు తీసుకుంటామని, ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూలై 11:**ఎస్ఐఆర్ ప్రక్రియలో జాప్యానికి తావులేకుండా నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఈఆర్ఓ, ఏఈఆర్ఓ, అదనపు ఏఈఆర్ఓ లను ఆదేశించారు. శనివారం ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా చేపడుతున్న ఈఎఫ్ డిజిటైజేషన్, అన్‌కలెక్టబుల్ డేటా ఎంట్రీలు, ఏఎస్‌డీడీ ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డూప్లికేట్ నమోదు తదితర పనుల పురోగతిపై కలెక్టర్ సంబంధిత ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గడువు దగ్గర పడుతోందని, ఈఎఫ్ డిజిటైజేషన్ శాతం, అన్‌కలెక్టబుల్ శాతం రెండింటిలోనూ ఆశించిన స్థాయిలో పురోగతి నమోదు కాలేదని కలెక్టర్ పేర్కొన్నారు. ఈఎఫ్ డిజిటైజేషన్ కనీసం 6 శాతం, అన్‌కలెక్టబుల్ పర్సంటేజ్ 3 శాతం మొత్తం కలిపి 9 శాతం వస్తుందని ఆశించడం జరిగిందని, అయినప్పటికీ కేవలం 5.5 శాతం రావడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం మూడు రోజుల సమయం మాత్రమే ఉన్నప్పటికీ ఎస్ఐఆర్ ప్రక్రియలో పురోగతి తక్కువగా ఉందని కలెక్టర్ ఈఆర్ఓ లను ప్రశ్నించారు. ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డూప్లికేట్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, సంబంధిత ఎంట్రీలను పూర్తి చేయాలని, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు నేరుగా పర్యవేక్షణ చేపట్టి పనులు వేగవంతం చేయాలని, ఏఎస్‌డీడీ ఎంట్రీలతో సహా అన్ని అంశాల్లో 100 శాతం లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. జిల్లాలో 61 నుండి 70 డిజిటైజేషన్ శాతంలో కర్నూలులో 154 పోలింగ్ కేంద్రాలలో, పాణ్యం లో 69 పోలింగ్ కేంద్రాలలో ఉన్నాయన్నారు.. కలెక్టర్ సంబంధిత ఏఈఆర్ఓలు, అడిషనల్ ఏఈఆర్ఓలతో మాట్లాడుతూ 80 శాతం పురోగతి తీసుకొని రాకుండా కేవలం 61 శాతం మాత్రమే పురోగతి తెచ్చారని, అదే విధంగా అబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డూప్లికేట్ కేసులను ఒకేసారి పరిష్కరించి, సంబంధిత ఎంట్రీల అంశంలో జాప్యం జరుగుతోందని, ఈ ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. డిజిటైజేషన్ ప్రక్రియలో కర్నూలు 71.23, పాణ్యం 74.90 శాతాలు ఉన్నాయన్నారు. బీఎల్‌ఓలను ఒకేచోట సమీకరించి, ఏఎస్‌డీడీ జాబితాల పరిశీలన, ధృవీకరణ, ఆన్‌లైన్ నమోదు పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ పాణ్యం, కర్నూలు ఈఆర్ఓ, అదనపు ఏఈఆర్ఓ లను ఆదేశించారు. అందుకు సంబంధించిన నివేదికలను 2 గంటలకు ఒక్కసారి పంపే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ను ఆదేశించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు ప్రక్రియను పూర్తి చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, కలెక్టర్ పేర్కొన్నారు. అదే విధంగా ఈఎఫ్ డిజిటైజేషన్, అన్‌కలెక్టబుల్ పర్సంటేజ్ లో, అబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డూప్లికేట్ ఎంట్రీలను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లను ఆదేశించారు. జూలై 21 వ తేదీన కేవలం డ్రాఫ్ట్ లిస్ట్ మాత్రమే పబ్లిష్ చేస్తున్నామని, అందులో ఏమైనా కరెక్షన్ ఉంటే క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్ సమయంలో ఫార్మ్ తీసుకొని కరెక్షన్ చేయవచ్చు అనే స్పష్టత బి ఎల్ ఓ లకు, వారి ద్వారా ప్రజలకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని నియోజకవర్గాల్లో గడువు లోపు సర్ ప్రక్రియ పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఈ ఆర్వో లు, ఏఈఆర్ఓ లను ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డిఆర్ఓ సి. వెంకట నారాయణమ్మ, కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, ఆదోని ఇంచార్జి సబ్ కలెక్టర్ మధుసూదన్ రెడ్డి, పత్తికొండ ఆర్డీఓ ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


# సీఎం గారూ! కడప వైద్య కళాశాల సీట్ల పెంపు సరే!మరి పులివెందుల, ఇతర కళాశాలల మాటేమిటి..?: మాజీ ఎంపీ తులసి రెడ్డి



**వేంపల్లె మన జనప్రగతి జులై 11:-** 2026-27 విద్యా సంవత్సరం నుంచే కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో 75, నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో 25 ఎంబిబిఎస్ సీట్లను పెంచుతూ నేషనల్ మెడికల్ కమిషన్ లెటర్ ఆఫ్ పర్మిషన్ ఇవ్వడం పై రాజ్యసభ మాజీ సభ్యుడు , కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అదే సమయంలో పులివెందుల, ఆదోని,మదనపల్లి, పెనుగొండ, మార్కాపురం, బాపట్ల,నర్సీపట్నం, అమలాపురం, పాలకొల్లు,పార్వతీపురం ప్రభుత్వ వైద్య కళాశాలల పరిస్థితి ఏమిటి అని ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను సూటిగా ప్రశ్నించారు వేంపల్లి లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు . పులివెందుల తో పాటు పైనపేర్కొన్న 9 ప్రభుత్వ వైద్య కళాశాలలు 2020 సెప్టెంబర్ 12న మంజూరయ్యాయని ఇంతవరకు ఆ కళాశాలల్లో తరగతులు ప్రారంభం కాలేదన్నారు . ఒక్కొక్క ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏడాదికి 150 ఎంబిబిఎస్ సీట్లు, 24 పీజీ సీట్లను విద్యార్థులుకోల్పోవడం జరిగిందన్నారు . ఆ విధంగా పైన పేర్కొన్న 10 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 2024 -25 విద్యాసంవత్సరానికి సంబంధించి 1500 ఎంబిబిఎస్ సీట్లు,240 పిజి సీట్లు,2025 - 26 విద్యా సంవత్సరానికి సంబంధించి 1500 ఎంబిబిఎస్ సీట్లు,240 పిజి సీట్లు, 2026 - 27 కు సంబంధించి 1500ఎంబిబిఎస్ సీట్లు 240 పీజీ సీట్లు కోల్పోవడం జరిగిందన్నారు .మొత్తం మీద ఈ మూడు సంవత్సరాల్లో కలిపి 4500 ఎంబిబిఎస్ సీట్లు, 720 మెడికల్ పిజి సీట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోల్పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కడప, నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు 100 ఎంబిబిఎస్ సీట్లు అదనంగా వచ్చినందులకు సంతోషపడాలా లేక 10 ప్రభుత్వ వైద్య కళాశాలలో 4500 ఎంబిబిఎస్ సీట్లు, 720 పిజి మెడికల్ సీట్లు కోల్పోయినందుకు బాధపడాలా అర్థం కాని పరిస్థితి ఉందని తులసి రెడ్డి ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికైనా పైన పేర్కొన్న పది ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అసంపూర్తిగా ఉన్న మౌలిక వసతులు పూర్తిచేసి, సిబ్బందిని నియమించి నేషనల్ మెడికల్ కమిషన్ తో మాట్లాడి 2026 - 27 విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించే విధంగా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి చేయాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం,పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్త ధ్రువ కుమార్ రెడ్డి,వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ,వేముల మండల శాఖ అధ్యక్షుడు వెంకటేశు , చక్రాయపేట మండల శాఖ అధ్యక్షుడు రామాంజనేయరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,,ఉత్తన్న,తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బద్రి, వేమా రాజా, రాఘవయ్య పాల్గొన్నారు.

# మండలంలో అంగన్వాడి సెంటర్ల రూటే సపరేటు

**• చూసి చూడనట్లు ఐసిడిఎస్ అధికారులు • మీడియా పర్యటనతో వెలుగులోకి వచ్చిన అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల భాగోతాలు.**




**వీరబల్లి మన జనప్రగతి జూలై 11:-** ఊరంతా ఒక రూటు ఉలికి పిట్టకు ఒక రూటు అన్న చందంగా మండలంలోని అంగన్వాడి సెంటర్ల నిర్వహణ సాగుతోంది. నేడు శనివారం కావడంతో మండలంలోని ఏ ఒక్క అంగన్వాడీ సెంటర్ ను కూడా తెరవకుండా పిల్లలకు హాజరు వేసిన వైనం మండలంలో కనిపించింది. వివరాల్లోకెళ్తే కడప జిల్లా వీరబల్లి మండలం లోని పత్రికా విలేకర్లు పలు అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించడం జరిగింది. ఈ పర్యటనలో భాగంగా మండలంలో వంగిమళ్ళ పెద్దూరు కస్పాలోని అంగన్వాడి సెంటర్,వీరబల్లి మండల కేంద్రంలోని 1, 2 అంగన్వాడి సెంటర్లు,గుర్రప్పగారిపల్లె అంగన్వాడి సెంటర్,గుర్రప్పగారిపల్లి గ్రామంలోని సీటీకే తొగటపల్లి అంగన్వాడి కేంద్రం,సీటీకే ఎస్సీ కాలనీలో ఉండాల్సిన అంగన్వాడి సెంటర్ సిటీకే తొగటపల్లి లోనీ అంగన్వాడీ సెంటర్, షికారుపాలెంలో సెంటర్ ఓపెన్ లో ఉంది. కానీ అక్కడ పనిచేసే అంగన్వాడి కార్యకర్త రెండు నెలల నుంచి సెంటర్ కు రాలేదని తానే రికార్డుల నిర్వహణ చూస్తున్నానని అక్కడ పని చేసే ఆయా చెప్పుకొస్తుంది. కానీ ఇక్కడ దాదాపు సంవత్సరం పైగా అక్కడ కార్యకర్త విధులకు రాలేదని సమాచారం. ఓదివీడు గ్రామంలో కుమ్మరపల్లి అంగన్వాడి సెంటర్,ఓదివీడు గ్రామంలో యర్రంరాజుగారిపల్లి అంగన్వాడి సెంటర్ ఇలా మండలంలోని దాదాపు అన్ని సెంటర్లు మూతపడ్డాయి. మండల వ్యాప్తంగా ఉన్న అంగన్వాడి కార్యకర్తలు విధులకు హాజరు కాకున్నా ఇంట్లో కూర్చుని హాజరు వేసిన వైనం చూస్తుంటే మిగతా రోజుల్లో కూడా ఇలాగే చేస్తున్నారనే అనుమానం రాక మానదు. ఈ తంతు చూస్తుంటే అంగన్వాడి సెంటర్ల కు ఐసిడిఎస్ అధికారులు రెండో శనివారం సెలవు ఇచ్చారా? అనే అనుమానం రాక మానదు. రాష్ట్రమంతా ఒక రూల్.. వీరబల్లి మండలంలో ఒక రూల్. మండల వ్యాప్తంగా ఒక్క సెంటర్ లో కూడా కనిపించని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు. ఇదంతా ఒక ఎత్తైతే మరికొందరు కూటమి నాయకుల అండ చూసుకొని దర్జాగా ఇంటి వద్దనే ఉండి పిల్లలకు హాజరు వేశారు. ఇకనైనా పై అధికారులు స్పందించి తనిఖీలు చేసి పిల్లలకు సరైన పోషకాహారం మరియు చదువు నేర్పించాలని ప్రజలు తెలుపుతున్నారు.

# చేనేత కార్మికులకు ఉచిత వైద్య శిబిరం..

### - దీర్ఘకాలిక వ్యాధుల నిర్ధారణ పరీక్షలు



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 11:-**సిద్ధవటం మండలం మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఉప్పరపల్లి గ్రామంలో చేనేత కార్మికుల కోసం శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా కడప జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డీఎంహెచ్వో రవిబాబు మాట్లాడుతూ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు చేనేత కార్మికులకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. రక్తహీనతతో బాధపడుతున్న వారు ఆకుకూరలు, పాలు, గుడ్లు వంటి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే సమీప ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీవిద్య, వైద్య సిబ్బంది గురుప్రసాద్, రమణయ్య, భారతి, జ్యోతి, కళ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ జనాభా దినోత్సవంపై చెన్నూర్‌లో ర్యాలీ



**చెన్నూరు మన జనప్రగతి జూలై 11:-** ప్రపంచ జనాభా దినోత్సవం లో భాగంగా చెన్నూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. సామాజిక ఆరోగ్య కేంద్రం . హౌస్ సర్జన్ బృందం వైద్య సిబ్బంది హెల్త్ అసిస్టెంట్లు ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు శనివారం చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వినయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జనాభా నియంత్రణ దేశ ప్రగతికి మూలమన్నారు. కుటుంబ నియంత్రణకు సహకరించాలన్నారు. పిల్లల పెంపకం కోసం బిడ్డకు బిడ్డ మధ్య దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ హెచ్ టి వైద్యులు డాక్టర్ చందన డాక్టర్ సుబ్బయ్య హెచ్ ఇ లక్ష్మీదేవి. సూపర్వైజర్ సుబ్బరామయ్య ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పరీక్షల నిర్వహణ బోర్డు కార్యదర్శిగా ముక్త్తోజు సుధాకర్‌కు ఘన సన్మానం



**మార్కాపురం, మన జనప్రగతి జూలై 11:-** మార్కాపురం జిల్లా పరీక్షల నిర్వహణ బోర్డు కార్యదర్శిగా నియమితులైన బీసీ భవన్ కమిటీ ఉద్యోగుల విభాగం ప్రధాన కార్యదర్శి ముక్తోజు సుధాకర్‌కు శనివారం స్థానిక బీసీ భవన్‌లో ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పిన్నిక లక్ష్మీ ప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2011 నుంచి బీసీ భవన్ కమిటీ ద్వారా సుధాకర్ బీసీల సంక్షేమం కోసం విశేషంగా కృషి చేశారని కొనియాడారు. నాన్-క్రీమిలేయర్ సర్టిఫికెట్ల సాధన, బీసీ విద్యార్థుల సమస్యల పరిష్కారం, ముఖ్యంగా మార్కాపురంలో బీసీ బాలికల వసతి గృహం ఏర్పాటు కోసం నిరంతరం చేసిన కృషి ఫలితంగానే ప్రభుత్వం హాస్టల్‌ను మంజూరు చేసిందని పేర్కొన్నారు. ఇల్లూరి రంగస్వామి గౌడ్ మాట్లాడుతూ, బీసీల ఐక్యతతోనే బీసీ భవన్ కమిటీ సమాజానికి సేవలందిస్తూ అవసరంలో ఉన్న వారికి అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో పాలెం చెంచయ్య నాయి, పిన్నిక నాగార్జున ప్రసాద్ యాదవ్, కొమర వెంకటేశ్వర్లు గౌడ్, వంకేశ్వరం శ్రీనివాస్ నాయి, సీహెచ్ సత్యనారాయణ ఆచారి, నాగార్జున గౌడ్, రంగారావు గౌడ్, సతీష్ గౌడ్, అల్లూరయ్య గౌడ్, బుర్రి చిన్న వెంకటేశ్వర్లు యాదవ్, పిన్నిక చక్రపాణి యాదవ్, నాగం వెంకటేశ్ యాదవ్, ఆర్. రాంబాబు ముదిరాజ్ తదితరులు పాల్గొని ముక్తోజు సుధాకర్‌ను అభినందించారు.

# నూతన కార్యవర్గ నియామకం..

### ● ఎన్ఆర్ఐ టీడీపీ జాతీయ కార్యవర్గంలో ఆర్గనైజింగ్ సెక్రటరీగా చెంచు వేణుగోపాల్ రెడ్డి నియామకం



**గాలివీడు మన జనప్రగతి జులై 11:**తెలుగుదేశం పార్టీ అధినాయకత్వం ఎన్ఆర్ఐ టీడీపీ జాతీయ కార్యవర్గాన్ని ప్రకటిస్తూ,అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం గోరాన్చెరువు గ్రామానికి చెందిన చెంచు వేణుగోపాల్ రెడ్డిని ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించినట్లు ఉత్తర్వులు జారీ చేసింది. చెంచు వేణుగోపాల్ రెడ్డి ఎన్నో సంవత్సరాలుగా ఎన్ఆర్ఐ టీడీపీ తరపున పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, పార్టీ కార్యక్రమాలను సమన్వయం చేయడం, విదేశాల్లోని తెలుగు ప్రజలను పార్టీతో అనుసంధానం చేయడంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి పార్టీ అధినాయకత్వం ఈ కీలక బాధ్యతను అప్పగించింది. ఈ సందర్భంగా చెంచు వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ..."నన్ను నమ్మి, నేను చేస్తున్న సేవను గుర్తించి, ఎన్ఆర్ఐ టీడీపీ జాతీయ కార్యవర్గంలో ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించిన మా పెద్దాయన నారా చంద్రబాబు నాయుడు కి, నారా లోకేష్ అన్నకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు.పార్టీ నాపై ఉంచిన ఈ నమ్మకాన్ని నిలబెట్టుకునేలా మరింత అంకితభావంతో పనిచేస్తాను. 2029 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయానికి నా వంతు కృషిని శక్తివంచన లేకుండా కొనసాగిస్తాను" అని తెలిపారు. ఈ సందర్భంగా తనకు ఈ అవకాశం కల్పించిన పార్టీ అధినాయకత్వానికి, తనను ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తూ అండగా నిలిచిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, శ్రేయోభిలాషులకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు...

# వాట్సాప్ గ్రూపుల్లో రెచ్చగొట్టే పోస్టులు పెడితే అడ్మిన్లపై చర్యలు

### ● మీఒంటిమిట్ట సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరిక



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 11:**-సోషల్ మీడియా,ముఖ్యంగా వాట్సాప్ గ్రూపుల్లో రెచ్చగొట్టే ప్రసంగాలు, వివాదాస్పద వ్యాఖ్యలు, అసభ్యకర పోస్టులు ప్రచారం చేస్తే సంబంధిత గ్రూప్ అడ్మిన్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ సిద్ధవటం, ఒంటిమిట్ట, నందలూరు మండలాల పరిధిలోని కొన్ని వాట్సాప్ గ్రూపుల్లో గత నెల రోజులుగా వివాదాస్పద వ్యాఖ్యలు, రెచ్చగొట్టే పోస్టులు, ఇతరులను అవమానించే సందేశాలు ప్రచారం అవుతున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి పోస్టులు సామాజిక శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. కొన్ని వాట్సాప్ గ్రూపులపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి చట్టవిరుద్ధ పోస్టులు, సందేశాలను ప్రోత్సహించే వారితో పాటు గ్రూప్ అడ్మిన్లపైనా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# డిజిటల్ వెల్నెస్‌పై బ్రహ్మకుమారి టీచర్లకు ప్రత్యేక శిక్షణ

### ● రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం

### ● రెండు తెలుగు రాష్ట్రాల నుంచి టీచర్ల పాల్గొనిక



**కడప మన జనప్రగతి జూలై 11:-**కడప నగరంలోని ఓంశాంతి నగర్‌లోని ప్రజాపతి బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సేవా కేంద్రంలో బ్రహ్మకుమారి టీచర్ల కోసం రెండు రోజుల డిజిటల్ వెల్నెస్ ట్రైనింగ్ ప్రోగ్రాం శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఆంధ్రాకర్ణాటక సబ్‌జోన్ అదనపు ఇన్‌చార్జి రాజయోగిని బ్రహ్మకుమారి గీత దీది ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. డిజిటల్ యుగంలో మానసిక ప్రశాంతత, సమయ నిర్వహణ, సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకునే విధానాలపై టీచర్లకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. శిక్షణ అందించేందుకు బెంగళూరు నుంచి బి.కె. గీత అక్కయ్య, హైదరాబాద్ నుంచి బాల్ భాయ్, బి.కె. వర్ష అక్కయ్య, బి.కె. ధీరజ్ అన్నయ్య హాజరై వివిధ అంశాలపై శిక్షణ అందిస్తున్నారు. ఉదయం 9.30 గంటలకు రాజయోగిని బ్రహ్మకుమారి గీత దీది, బి.కె. ఉమా అక్కయ్య, బి.కె. రమణీ అక్కయ్య, బి.కె. ప్రదీప్ అక్కయ్యతో పాటు ఇతర ప్రముఖులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక విలువలు, డిజిటల్ క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, ఒత్తిడి నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేకంగా శిక్షణ అందించారు. ఈ రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన బ్రహ్మకుమారి టీచర్ అక్కయ్యలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది.

# ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారమే లక్ష్యం

### - ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి





**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 11:-** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వెంటనే పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రొద్దుటూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఆధ్వర్యంలో 'ప్రజా దర్బార్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను ఓర్పుతో విన్నారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లి వారికి సత్వర న్యాయం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజా సేవే పరమావధిగా ప్రతి ఒక్కరికీ అండగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కడప పార్లమెంట్ అధికార ప్రతినిధి ఘంటసాల వెంకటేశ్వర్లు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కొండయ్య, కట్టమీది రామకృష్ణారెడ్డి, వెంకట సుబ్బయ్య, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 11:** ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పి.కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మురళీమోహన్ ఆధ్వర్యంలో శనివారం సిద్ధవటం మండల కేంద్రంలో ఎస్సీ బాలికల వసతి గృహ విద్యార్థినులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీమోహన్ మాట్లాడుతూ..జనాభా నియంత్రణ, కుటుంబ నియంత్రణ, పిల్లల మధ్య తగిన వ్యవధి పాటించడం వల్ల తల్లి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు పుట్టబోయే శిశువులు కూడా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. సరైన కుటుంబ ప్రణాళిక ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం, దేశ భవిష్యత్తు నిర్మాణానికి తోడ్పాటు అందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ లక్ష్మీనరసమ్మ, సూపర్వైజర్లు మౌలాలి, శారదాదేవి, హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, అంగన్‌వాడీ కార్యకర్త సరోజ, ఆశా కార్యకర్తలు భారతి, ఓబులమ్మ, కళావతి, పద్మతో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

# 14లోపు ఎస్ ఐ ఆర్ వెరిఫికేషన్ 100 శాతం పూర్తి చేయాలి: ఎమ్మెల్యే నంద్యాల



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి జూలై 11:-** ప్రొద్దుటూరు నియోజకవర్గంలో కొనసాగుతున్న ఎస్ ఐ ఆర్ ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతగా తీసుకుని ఈ నెల 14వ తేదీలోపు 100 శాతం పూర్తి చేయాలని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులు, బీఎల్ఏలు, బీఎల్వోలు, ఏఆర్వోలు మిగిలిన మూడు రోజులను అత్యంత కీలకంగా భావించి ప్రతి ఇంటికి వెళ్లి ఒక్క ఓటరు కూడా మిస్ కాకుండా వెరిఫికేషన్ పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్, ఎమ్మార్వోలు ఈ ప్రక్రియను అత్యంత సీరియస్‌గా పర్యవేక్షిస్తున్నందున ప్రతి వార్డు, ప్రతి బూత్‌లోని ప్రతి ఓటరిని తప్పనిసరిగా వెరిఫికేషన్ చేయించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఒక్క వెరిఫికేషన్ కూడా పెండింగ్‌లో ఉండకూడదని, తమ పరిధిలో ఒక్క ఓటరు వెరిఫికేషన్ కాకపోయినా అది బాధ్యతలో జరిగిన లోపంగా పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించారు. వెరిఫికేషన్ చేయించుకోని వారి ఓటు హక్కు భవిష్యత్తులో ప్రభావితమయ్యే అవకాశం ఉన్నందున ప్రతి బీఎల్ఏ ఇంటింటికీ వెళ్లి వెరిఫికేషన్ పూర్తి చేయించాలని సూచించారు. ఈ సూచనను కేవలం విజ్ఞప్తిగా కాకుండా బాధ్యతగా, ఆదేశంగా భావించి ప్రతి నాయకుడు తన పరిధిలోని వెరిఫికేషన్‌ను పూర్తి చేయాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి కోరారు. "లక్ష్యం ఒక్కటే... వంద శాతం వెరిఫికేషన్ సున్నా శాతం పెండింగ్" అని ఆయన స్పష్టం చేశారు.

# మైనారిటీ యువతకు ఆశాకిరణంగా 'మెగా జాబ్ మేళా2026'



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 11:-** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన "మెగా జాబ్ మేళా2026" ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, ఏపీ స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా షేక్ కార్పొరేషన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. వి.ఎస్. ముక్తియార్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను మైనారిటీ యువత సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించి కుటుంబాల అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మెగా జాబ్ మేళాలో పలు ప్రముఖ కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూలలో ఎంపికైన అభ్యర్థులకు వేదికపైనే అపాయింట్‌మెంట్ లెటర్లను అందజేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేలాది మంది మైనారిటీ యువత పాల్గొని తమ ప్రతిభను చాటుకోవడంతో పాటు ఉద్యోగ అవకాశాలను సొంతం చేసుకున్నారు. యువత సాధికారత, ఉపాధి కల్పన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఇటువంటి కార్యక్రమాలు మైనారిటీ యువత భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.

# ప్రొద్దుటూరులో జూలై 16న వైభవంగా పూరీ జగన్నాథ రథయాత్ర

### భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జగన్నాథుని కృపకు పాత్రులు కావాలి: ఐఎస్‌కేఎం




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 11:-** ప్రొద్దుటూరులో అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిరం (ఐఎస్‌కేఎం) ఆధ్వర్యంలో ఈ నెల 16న పూరీ జగన్నాథ రథయాత్రను వైభవంగా నిర్వహించనున్నట్లు ఐఎస్‌కేఎం ప్రొద్దుటూరు భవన్ అధ్యక్షుడు వినోద్ కృష్ణదాస్ తెలిపారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పూరీ జగన్నాథ రథయాత్ర ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు దర్శించాలనుకునే అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక వేడుక అని పేర్కొన్నారు. ఈ రథయాత్రను దర్శించిన వారికి పునర్జన్మ ఉండదనే విశ్వాసం ఎన్నో ఏళ్లుగా కొనసాగుతోందని తెలిపారు. ఈ ఆధ్యాత్మిక భాగ్యాన్ని పేద, మధ్యతరగతి ప్రజలతో సహా అందరికీ చేరువ చేయాలనే ఉద్దేశంతో స్థాపక ఆచార్యులు శ్రీల ప్రభుపాదుల మార్గదర్శకత్వంలో ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో ఐఎస్‌కేఎం ఆధ్వర్యంలో రథయాత్రలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ప్రొద్దుటూరులో కూడా ఈ మహోత్సవాన్ని నిర్వహించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. రథయాత్ర జూలై 16న ఉదయం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిరం నుంచి ప్రారంభమై, మైదుకూరు రోడ్డు, శివాలయం సర్కిల్, రాజీవ్ సర్కిల్, కొర్రపాడు రోడ్డులోని రిజిస్ట్రార్ కార్యాలయం వరకు వెళ్లి, తిరిగి అదే మార్గంలో ఐఎస్‌కేఎం ప్రాంతీయ కార్యాలయానికి చేరుకుంటుందని వివరించారు. రథయాత్ర సందర్భంగా హరినామ సంకీర్తన, భజనలు, ప్రసాద వితరణ వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణ ప్రజలందరూ కుటుంబ సమేతంగా ఈ రథయాత్రలో పాల్గొని శ్రీ జగన్నాథ స్వామివారి అనుగ్రహానికి పాత్రులు కావాలని వినోద్ కృష్ణదాస్ పిలుపునిచ్చారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
12 - 07 - 2026

# వియత్నాంలో ఘోర విషాదం

● పడవ ప్రమాదంలో కడపకు చెందిన ప్రముఖ మొబైల్ ఫోన్స్ వ్యాపారి ముడియం శ్రీధర్ మృతి ● తెలుగు రాష్ట్రాల పర్యాటకులపై విషాదం ● ఘటనపై స్పందించిన జిల్లా కలెక్టర్



**కడప/వియత్నాం,మన జనప్రగతి జూలై 11:-** వియత్నాంలో జరిగిన ఘోర పడవ ప్రమాదం తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఓ ప్రముఖ మొబైల్ సంస్థ తన రాష్ట్రవ్యాప్త పంపిణీదారుల కోసం నిర్వహించిన విదేశీ పర్యటనలో భాగంగా వియత్నాం వెళ్లిన కడపకు చెందిన ప్రముఖ మొబైక్ వ్యాపారవేత్త ముడియం శ్రీధర్ ఈ ప్రమాదంలో మృతి చెందారు.కడపకు చెందిన ముడియం శ్రీధర్, నయిమ్‌తో కలిసి ఈ పర్యటనకు వెళ్లారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 25 నుంచి 28 మంది పంపిణీదారులు ఈ విహారయాత్రలో పాల్గొన్నారు. పర్యాటకులు ప్రయాణిస్తున్న పడవ ప్రమాదవశాత్తు బోల్తా పడటంతో ఈ విషాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పలువురు భారతీయ పర్యాటకులు మృతి చెందినట్లు సమాచారం. మృతుల్లో ఎక్కువ మంది ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వారేనని తెలుస్తోంది.ప్రమాద సమయంలో నయిమ్ సురక్షితంగా బయటపడగా, ఆయన అక్కడి పరిస్థితులను వీడియోల రూపంలో సామాజిక మాధ్యమాల ద్వారా పంపించారు. అలాగే శ్రీధర్ కుటుంబ సభ్యులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ ఘటనకు సంబంధించిన వివరాలను తెలియజేస్తున్నారు.కాగా... మృతుడు ముడియం శ్రీధర్ గత 25 సంవత్సరాలుగా 'కౌశిక్ కమ్యూనికేషన్స్' పేరుతో మొబైల్ వ్యాపార రంగంలో కొనసాగుతున్నారు. ఆయనకు కుమారుడు కౌశిక్ (18), కుమార్తె కిరణ్మయి ఉన్నారు.కడప జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఈ ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందని తెలిపారు.ఈ ఘటనపై వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. స్థానిక అధికారులతో కలిసి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నామని, బాధిత కుటుంబాలకు సహాయం అందించేందుకు హో చి మిన్ నగరం, హనోయిలో ప్రత్యేక నియంత్రణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది.ఈ ఘటనతో కడప జిల్లాలో విషాద ఛాయలు అలుముకున్నాయి. శ్రీధర్ మృతి వార్త తెలిసిన వెంటనే బంధువులు, స్నేహితులు, వ్యాపార వర్గాలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి.

# రాష్ట్ర స్థాయి యూఎస్ఎఫ్ఐ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి

● ఉరవకొండలో కరపత్రాల విడుదల..

● విద్యార్థులను పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపు




**ఉరవకొండ మన జనప్రగతి జూలై 11:-**ఈ నెల 20, 21 తేదీలలో నంద్యాల పట్టణంలో నిర్వహించనున్న యునైటెడ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (యూఎస్ఎఫ్ఐ) రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని యూఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉరవకొండ పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహం వద్ద జిల్లా కార్యదర్శి భీమేష్ ఆధ్వర్యంలో శనివారం కరపత్రాలను విడుదల చేశారు. రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు విద్యార్థి నాయకత్వ వికాసానికి, విద్యార్థి సమస్యలపై అవగాహన పెంపొందించుకోవడానికి దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ మండల నాయకులు శివ, హరి, నవీన్, సురేష్, కృష్ణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# బిడ్డకు బిడ్డకు మధ్య వ్యవధి పాటిద్దాం.. ఆరోగ్యవంతమైన కుటుంబాన్ని నిర్మిద్దాం

● ప్రపంచ జనాభా దినోత్సవ వేడుకల్లో

ఎంపీహెచ్ఈఓ గురు ప్రసాద్ పిలుపు




**వజ్రకరూరు మన జనప్రగతి జూలై 11:-**ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని వజ్రకరూరు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ప్రజలకు కుటుంబ నియంత్రణ, జనాభా నియంత్రణ, బాల్యవివాహాల నివారణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎంపీహెచ్ఈఓ గురు ప్రసాద్ మాట్లాడుతూ, జనాభా సమస్యలపై ప్రజల్లో చైతన్యం కల్పించడమే ప్రపంచ జనాభా దినోత్సవం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కుటుంబం ఆరోగ్యంగా ఉంటేనే సమాజం, దేశం ఆరోగ్యంగా ఉంటాయని పేర్కొన్నారు. బిడ్డకు బిడ్డకు మధ్య తగిన వ్యవధి పాటించడం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన కుటుంబాన్ని నిర్మించుకోవచ్చని సూచించారు.స్త్రీలకు 18 సంవత్సరాలు, పురుషులకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహాలు జరపాలని ఆయన తెలిపారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిసినా లేదా జరగబోతున్నట్లు సమాచారం ఉన్నా వెంటనే సంబంధిత అధికారులు, పోలీసు శాఖ, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు లేదా 1098, 181, 112, 100 హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.బాల్యవివాహ నిషేధ చట్టం ప్రకారం నేరం రుజువైతే రెండేళ్ల వరకు జైలు శిక్ష, రూ.1 లక్ష వరకు జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నాగశంకర్, ఫార్మసిస్ట్ రామచంద్ర నాయక్, హెల్త్ అసిస్టెంట్ సంపత్ కుమార్, స్టాఫ్ నర్స్ సుజాత, ఏఎన్ఎం లక్ష్మీ, ఆశా వర్కర్ ఆనందలక్ష్మి, వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

# ముడియం శ్రీధర్ కుటుంబాన్ని పరామర్శించిన ఆర్డీవో



**కడప టౌన్ మన జనప్రగతి జూలై 11:-** వియత్నాంలో జరిగిన పడవ ప్రమాదంలో కడపకు చెందిన ముడియం శ్రీధర్ మృతి చెందిన విషయం తెలుసుకున్న వెంటనే జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశాల మేరకు కడప ఆర్డీవో మురళి.. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ ఘటన పట్ల జిల్లా యంత్రాంగం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోందని ఆర్డీవో తెలిపారు. శ్రీధర్ మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకురావడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను సమీక్షిస్తున్నామని, మృతుడు శ్రీధర్ వాణిజ్య భాగస్వామ్య కంపెనీ యాజమాన్య ప్రతినిధితో కూడా మాట్లాడి సమన్వయం చేస్తున్నట్లు చెప్పారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహాయ సహకారాలు అందించి, న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలుపుతూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఏవీఆర్ పాఠశాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి

● ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనలపై ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సీఎం సిద్దు డిమాండ్




**ఉరవకొండ మన జనప్రగతి జూలై 11:-**ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రైవేట్ విద్యాసంస్థలను నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎఫ్‌డీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు సీఎం సిద్దు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉరవకొండలోని ఏవీఆర్ పాఠశాల యాజమాన్యానికి వినతిపత్రం అందజేసి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహణకు సంబంధించిన అన్ని అనుమతులు, ధ్రువపత్రాలు, రికార్డులను బహిర్గతం చేయాలని కోరారు.గత 202425 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాలపై వాస్తవాలకు విరుద్ధంగా ప్రచారం నిర్వహించి తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరిగిందని ఆయన ఆరోపించారు. అలాగే ప్రభుత్వ అనుమతులు లేకుండానే ఒలింపియాడ్, ఐఐటీ తదితర కోచింగ్‌ల పేరుతో ప్రచారం నిర్వహించడం, పాఠశాల బస్సులపై అనుమతి లేని ప్రకటనలు ప్రదర్శించడం, శబ్ద కాలుష్య నిబంధనలను ఉల్లంఘించడం, ప్రహరీ గోడ లేకుండా విద్యార్థుల భద్రతను నిర్లక్ష్యం చేయడం వంటి అంశాలపై సంబంధిత శాఖలు సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.ప్రభుత్వ జీవోలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలతో పాటు, ఉపాధ్యాయులకు కనీస వేతనాలు, పీఎఫ్ తదితర చట్టబద్ధ హక్కులు కల్పించకుండా శ్రమ దోపిడీ జరుగుతోందనే ఫిర్యాదులపై కూడా అధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పాఠశాల గుర్తింపు, డైస్ కోడ్, ట్రస్ట్ లేదా సొసైటీ నమోదు పత్రాలు, ఫైర్ ఎన్‌వోసీ, భవన భద్రతా ధ్రువపత్రం, శానిటరీ సర్టిఫికేట్, సురక్షిత తాగునీటి ధ్రువపత్రం, అర్హత కలిగిన ఉపాధ్యాయుల వివరాలు, సీసీటీవీ వ్యవస్థ, విద్యార్థుల భద్రతా కమిటీ, పాఠశాల బస్సుల ఫిట్‌నెస్, పర్మిట్, బీమా, జీపీఎస్, స్పీడ్ గవర్నర్ తదితర వివరాలను ప్రజల ముందు ఉంచాలని ఆయన కోరారు.ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పాఠశాల నిర్వహణ ఉంటే సంబంధిత రికార్డులన్నింటినీ బహిర్గతం చేయాలని, లేకపోతే విద్యాశాఖ, కార్మిక శాఖ, రవాణా శాఖ, అగ్నిమాపక శాఖతో పాటు జిల్లా యంత్రాంగం సంయుక్తంగా సమగ్ర విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఎం సిద్దు డిమాండ్ చేశారు.

# కొత్తపల్లిలో తాగునీటి సమస్యకు పరిష్కారం..

- బోరు మరమ్మతు చేపట్టిన టీడీపీ నాయకులు



**బొమ్మనహాల్ మన జనప్రగతి జూలై 11:-** మండల పరిధిలో దర్గాహొన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో గత మూడు రోజులుగా త్రాగు నీరు బోరు చెడిపోవడంతో ప్రజలకు తాగునీటి సమస్య తీవ్రంగా నెలకొంది.ఈ సమస్యను తెలుసుకున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వెంటనే గ్రామ నాయకులకు అదేశాలు జారీ చేశారు,వెంటేనే అక్కడికి చేరుకున్న టీడీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు మాజీ సర్పంచ్ వై.కేశప్ప ఆధ్వర్యంలో త్రాగు నీరు బోరుకు మరమ్మతులు చేయించి గ్రామ ప్రజలకు తాగునీటి సరఫరా ఇబ్బంది లేకుండా సమస్యను పునరుద్ధరించారు,ఈ సందర్భంగా వై. కేశప్ప మాట్లాడుతూ..టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు,భవిష్యత్తులో కూడా గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ముందుండి పనిచేస్తామని అన్నారు,గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న,ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కు గ్రామ ప్రజలందరు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పార్లమెంట్ అధికార ప్రతినిధి ఎచ్.ఆనంద్, వన్నల్లి టీడీపీ యువ నాయకుడు వాల్మీకి రామస్వామి,కొత్తపల్లి టీడీపీ నాయకులు హనుమంతు, వన్నూరప్ప,గాదిలింగ, నరసింహారెడ్డి,ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ మొహమ్మద్ రఫీ,తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన




**బొమ్మనహాల్ మన జనప్రగతి జూలై 11:-**స్తానిక మండల కేంద్రంలో ఆర్.డి.టి కాలనీలో మరియు ఉద్దేహాల్,సిద్దాపురం గ్రామల ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ..పెరుగుతున్న జనాభా వల్ల కలిగే లాభనష్టాలు, చిన్న కుటుంబంసంతోషకరమైన కుటుంబం యొక్క ప్రాధాన్యత, సరైన వయస్సులో వివాహం, మొదటి గర్భధారణకు తొందరపడకూడదని,ప్రతి గర్భధారణ మధ్య కనీసం 23 సంవత్సరాల విరామం పాటించాలని వివరించారు, అదేవిదంగా ఆరోగ్యకరమైన తల్లి, ఆరోగ్యకరమైన శిశువు, ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని తెలియజేశారు. అలాగే కుటుంబ నియంత్రణ పద్ధతులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందుబాటులో ఉన్నాయని వివరించి,ఆశ, అంగన్‌వాడీ,ఏఎన్ఎం,మరియు ఆరోగ్య సిబ్బంది వారు ఇచ్చిన సూచనలు తప్పక పాటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఈశ్వరయ్య,ఎం.ఎల్.హెచ్.పి, రాధమ్మ,ఏఎన్ఎం భాగ్యశ్రీ,ఆరోగ్య కార్యకర్త గోవర్ధన్, వెంకటరమణ, ఆశ కార్యకర్తలు లక్ష్మి,హరిత,లక్ష్మి, మరియు ప్రజలు పాల్గొన్నారు.

# బద్వేల్ టీడీపీకి కొత్త బాస్



**పోరుమామిళ్ల మన జనప్రగతి జులై 11:-**దాదాపు సంవత్సరకాలంగా బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మార్పు అంశం సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాను తలపించింది. టీడీపీ కార్యకర్తలు,ప్రజల మధ్య నియోజకవర్గంలో ఎక్కడ చూసినా, ఏ సర్కిల్ లో చూసినా ఇదే విషయంపై చర్చ కొనసాగేది, ఎట్టకేలకు చివరకు ఆరోజు రానేవచ్చింది. నియోజకవర్గ పార్టీ శ్రేణుల్లో, ప్రజల్లో వున్న గందరగోళ పరిస్థితులకు నేడు తెరపడింది. ప్రస్తుతం ఉమ్మడి కడప జిల్లా డీసీసీబీ ఛైర్మెన్ గా కొనసాగుతున్న అట్లూరు మండలానికి చెందిన మంచూరు సూర్యనారాయణ రెడ్డిని బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గా నియమిస్తూ టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు జులై 11 న అధికారికంగా ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.

# ఆరోగ్య సిబ్బంది ఆశ వర్కర్ల ర్యాలీ




**కడప మన జనప్రగతి జూలై 11 :-** ప్రపంచజనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయము నందు కార్యాలయ సిబ్బంది మరియు పట్టణ ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తల ద్వారా ర్యాలీ తదుపరి అవగాహన సమావేశం నిర్వహించబడినది. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ రవి బాబు తల్లి శిశువు ఆరోగ్య పరిరక్షణకు, పిల్లల జననాల మధ్య సరైన వ్యవధి అత్యంత అవసరమని తెలియజేశారు. ఆర్. బి. ఎస్. కే. కోఆర్డినేటర్ డాక్టర్ అరిపులా మాట్లాడుతూ నవదంపతులు, గర్భిణులు, బాలింతలు మరియు యువత కుటుంబ నియంతన పద్ధతులు వాటి ప్రయోజనాల గురించి తెలియజేశారు. డి.పి.ఎమ్.ఓ. డాక్టర్ మహమ్మద్ తాహ మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయాలు, అంగన్వాడి కేంద్రాలు, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో జనాభా దినోత్సవం గురించి ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంకాధికారి రమేష్ రెడ్డి, డెమో భారతి మరియు ఆరోగ్య సిబ్బంది, ఆఫీసు సిబ్బంది మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేమకల్లు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

- పెద్ద ఎత్తున దర్శించుకున్న భక్తులు



**బొమ్మనహాల్ మన జనప్రగతి జూలై 11:-**మండల పరిధిలో నేమకల్లు గ్రామంలో అత్యంత ప్రసిద్ధి గాంచిన ఆంజనేయస్వామి బాలాలయంలో శనివారం స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ సందర్భంగా ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్ చార్యులు ఆధ్వర్యంలో స్వామి వారిని పట్టువస్త్రాలు,పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు,ఆలయ పురోహితులు వేకువజాము నుంచే స్వామివారికి కుంకుమార్చన, పంచామృ తాభిషేకం,ఆకుపూజ, విశేష పూజా అలంకరణ, అర్చనలు నిర్వహించారు.కర్ణాటక ఆంధ్ర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు,ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

# క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్

- అర్జీదారులతో మమేకమైన ఎంపీ అవినాష్ రెడ్డి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 11:-**ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ప్రజా దర్బార్ కార్యక్రమాలలో భాగంగా ప్రజలు మరియు కార్యకర్తలతో మమేకమయ్యారు. శనివారం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తన క్యాంపు కార్యాలయం నందు ప్రజలతో మమేకమై వివిధ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఎంపీ అవినాష్ రెడ్డికి వినతులు అందించగా సంబంధిత అధికారులతో చర్చించి వాటిని పరిష్కరించే ప్రయత్నం చేశారు.ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హామీల అమలులో అలసత్వం వహిస్తూ పేద ప్రజలకు సంక్షేమాన్ని దూరం చేస్తోందని వీటన్నింటినీ ప్రజలకు తెలియజేసి ప్రభుత్వ విధానాలను ప్రశ్నించాలని కార్యకర్తలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజలు వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మనజనప్రగతి
12 - 07 - 2026

# వైస్ ఎంపీపీ రమేష్ తండ్రి మృతికి వైసీపీ నేతల ఘన నివాళి..


**- కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భరోసా..**





**బొమ్మనహాల్ మన జనప్రగతి జూలై 11:**-బొమ్మనహాల్ మండల వైస్ ఎంపీపీ కొట్టపల్లి రమేష్ తండ్రి కొట్టపల్లి ఆంజనేయులు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆయన మృతివార్త తెలుసుకున్న బొమ్మనహాల్, కనేకల్ మండలాలకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు శనివారం కందేపల్లి గ్రామానికి పెద్ద ఎత్తున చేరుకుని ఆంజనేయులు భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.అనంతరం వైస్ ఎంపీపీ కొట్టపల్లి రమేష్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించిన నాయకులు, ఈ విషాదాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు.కుటుంబానికి ఈ లోటు తీరనిదని పేర్కొంటూ, ఈ కష్టకాలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ అండగా ఉంటారని భరోసా కల్పించారు.ఆంజనేయులు సామాజిక సేవాభావం కలిగిన వ్యక్తిగా, గ్రామ ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండేవారని పలువురు నాయకులు స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా ట్రెజరర్, బీసీ సెల్ నాయకులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, యువ నాయకులు, వివిధ గ్రామాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.


# వేంపల్లెలో విద్యుదాఘాతంతో వెల్డర్ మృతి



**వేంపల్లె మన జనప్రగతి జులై 11:**-వేంపల్లె పట్టణంలో శనివారం విద్యుదాఘాతంతో షేక్ సర్దార్(39) మృతి చెందారు. అతను ఓ ఇనుప చువ్వను కట్ చేస్తుండగా ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ సంభవించి గాయాలపాలై మృత్యుపాలయ్యారు.పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక బిడాలమిట్టకు చెందిన సర్దార్ ఇక్కడి కడప రోడ్ లోని ఆర్టీసీ బస్ స్టేషన్ సమీపంలో ఉన్న తన సోదరుడు మహమ్మద్ హుస్సేన్ నిర్వహిస్తున్న వెల్డింగ్ షాపులో పనుల కోసం వెళ్తున్నారు. గడచిన రెండేళ్లుగా అతను ఇక్కడ పనులు చేస్తున్నారు.ఈ నేపథ్యంలో పట్టణానికి చెందిన దస్తగిరి అనే వ్యక్తి ఇనుప చువ్వ తీసుకొని దాన్ని కట్ చేయించుకునేందుకు సదరు దుకాణం వద్దకు వచ్చారు. ఇంతలో అక్కడే ఉన్న సర్దార్ ఆ చువ్వను తీసుకొని వెల్డింగ్ మిషన్ సాయంతో కట్ చేస్తుండగా ప్రమాదవశాత్తు అతని రెండు కాళ్లకు విద్యుత్ షాక్ తగిలి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతన్ని అతని సోదరుడు, చుట్టుపక్కల వారు స్థానిక వైద్య విధాన పరిషత్ ఆసుపత్రికి తరలించగా చికిత్స అక్కడే మృతి చెందారు. ఇతనికి భార్య పీరున్ని, ఏడాది వయసు ఉన్న కుమార్తె ఉన్నారు. కుటుంబాన్ని పోషించే మగ దిక్కు విద్యుదాఘాతంలో మృతి చెందడంతో ఆ ఇంట విషాదఛాయలు అమ్ముకున్నాయి. మృతుని భార్య ఫిర్యాదు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేంపల్లె ఎస్ ఐ తాయార్ హుస్సేన్ తెలిపారు.

# గండి అంజన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

**• ప్రత్యేక ప్రార్థనలు, పుణ్య స్నానాలు • శ్రావణమాస ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి**



**వేంపల్లె మన జనప్రగతి జులై 11:**-ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గండి వీరాంజనేయ స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శనివారం తెల్లవారు జామున నుంచే గండిక్షేత్రానికి చేరుకున్న భక్తులు పాపాగ్నినదిలో పుణ్య స్నానాలు ఆచరించి, స్వామిని దర్శించుకున్నారు. ప్రధాన అర్చకుడు కేసరి స్వామి ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆగస్టు నెలలో జరిగే శ్రావణమాస ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తారని, వీరికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా తగు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి విశ్వనాథ్ రెడ్డి వెల్లడించారు. నిత్యాన్నదాన పథకం ద్వారా భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు పాలక మండలి చైర్మన్ వెంకటస్వామి వివరించారు.

# మడకశిరలో రూ.70 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**- 194 మంది పేద కుటుంబాలకు ఆర్థిక సాయం**

**- లబ్ధిదారులతో కలిసి సహపంక్తి భోజనం**




**మడకశిర మన జనప్రగతి జులై 11:**-ఆసుపత్రి చికిత్స ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు పేర్కొన్నారు. మడకశిర నియోజకవర్గ పరిధిలో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన 194 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.70 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే లబ్ధిదారులతో కలిసి సహపంక్తి భోజనంలో పాల్గొని వారి ఆరోగ్య పరిస్థితులు, కుటుంబ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సహాయం అందుకున్న వారితో కలిసి భోజనం చేయడం ప్రజాప్రతినిధులుప్రజల మధ్య ఉన్న ఆత్మీయతకు నిదర్శనంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, పోరుమామిళ్ల మాజీ సర్పంచ్, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి,మడకశిర నియోజకవర్గ పరిశీలకులు యనమల సుధాకర్,డా.డి శ్రీనివాసమూర్తి,పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సచ్చిదానంద ఆశ్రమమును పరిశీలించిన సబ్ కలెక్టర్ భావన



**వీరబల్లి మన జనప్రగతి జూలై11:**-మండల కేంద్రంలో సబ్ స్టేషన్ వెనుక భాగమున ఉన్న శ్రీ సచ్చిదానంద ఆశ్రమమును శనివారం రాజంపేట సబ్ కలెక్టర్ భావన పరిశీలించడం జరిగింది. ఈ ఆశ్రమము ఆశ్రమం యొక్క స్థలమును, పక్కన ఉన్న స్వామి పూర్తిగా ఆక్రమించుకోవడంతో ఈ విషయంపై మండల ప్రజలు గ్రామ పెద్దలు ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగింది. గత నెల నుండి ఈ సమస్య కొనసాగుతున్నది.ఫిర్యాదు మేరకు ఆమె రావడం జరిగింది,ఆశ్రమమును దాని యొక్క స్థలమును పరిశీలించారు. అక్కడికి హాజరైన గ్రామ పెద్దలను కార్యనిర్వాహకులు ఆశ్రమం యొక్క వివరాలను తెలియపరచడం జరిగింది.ఆశ్రమమును స్థలమును ఆక్రమించుకున్న స్వామి తెలంగాణకు చెందిన వ్యక్తి గత కొన్ని సంవత్సరాల నుండి ఆశ్రమం పక్కన నివాసముండేవాడు.సచ్చిదానంద ఆశ్రమంలో ఉన్న గోసి స్వామి మరణించడంతో అనంతరం ఈ ఆశ్రమమును పక్కన ఉన్న తెలంగాణకు చెందిన స్వామి ఆక్రమించుకోవాలనే దురుద్దేశంతో ప్రయత్నం చేస్తున్నాడు ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఉన్నతాధికారులకు స్థానిక తాసిల్దారుకు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ వివరాలన్నీ తెలుసుకున్న సబ్ కలెక్టర్ భావన వెంటనే సంబంధించిన రిపోర్టు పంపాలని స్థానిక తాసిల్దార్ ఖాజాబీనీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై సుస్మిత పోలీస్ సిబ్బంది గ్రామ పెద్దలు ఆశ్రమ కమిటీ సభ్యులు,కార్యవర్గకులు పాల్గొన్నారు.

# నాకు రక్షణ కల్పించండి, ప్రాణహాని ఉంది

**- ఎస్పీకి వినతి పత్రం అందించిన మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి**



**చక్రాయపేట మన జనప్రగతి జులై 11:** తమ గ్రామాల పరిధిలో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాకు వ్యతిరేకంగా పోరాడుతున్నందున,అధికార పార్టీ నాయకుల నుండి తనకు ప్రాణహాని ఉందని చక్రాయపేట మండలం కుమారకాల్వ మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.ఈ మేరకు ఆయన జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ప్రసాద్‌ను కలిసి తనకు తక్షణమే రక్షణ కల్పించాలని కోరుతూ శనివారం ఒక వినతిపత్రాన్ని సమర్పించారు.గడిచిన ఏడాది కాలంగా చక్రాయపేట మండలం పరిధిలోని కుమారకాల్వ,మారెళ్లమడక, అద్దలమర్రి గ్రామాల్లోని పాపాఘ్ని నదిలో సాగుతున్న అక్రమ ఇసుక మాఫియాపై తాను నిరంతరం పోరాటం చేస్తున్నట్లు శ్రీధర్ రెడ్డి వివరించారు.ఈ అక్రమాలపై జిల్లా కలెక్టర్,మైనింగ్ అధికారులతో పాటు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ ) కి కూడా ఫిర్యాదు చేసినట్లు ఆయన గుర్తుచేశారు.ఇటీవల అక్రమ మైనింగ్ వల్ల ఏర్పడిన గోతుల్లో పడి ఇద్దరు విద్యార్థులు మరణించారని గ్రామస్తుల వ్యతిరేకతతో కలెక్టర్ ఆ ఇసుక రీచ్‌ను మూసివేశారని దీనివల్ల ప్రతిరోజూ వస్తున్న లక్షలాది రూపాయల అక్రమ ఆదాయం ఆగిపోవడంతో,అధికార పార్టీ నాయకులు నాపై కక్ష పెంచుకున్నారని అన్నారు.తన ప్రాణాలకు ముప్పు పొంచి ఉందనడానికి గల బలమైన ఆధారాలను,కొన్ని కీలక ఫోన్ సంభాషణల (ఆడియో రికార్డింగ్‌లను) శ్రీధర్ రెడ్డి ఎస్పీకి అందజేశారు.మండల టీడీపీ నాయకులు మహేశ్వర రెడ్డి,మావి రెడ్డి తదితరులు కిరాయి హంతకులతో తనపై దాడి చేయించేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. ఎలాంటి కేసులు కాకుండా చూసుకుంటామని టీడీపీ నేత బీటెక్ రవి హామీ ఇచ్చినట్లు ఆ సంభాషణల్లో ఉందని శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు.ఇప్పటికే తన కదలికలపై కొందరు 'రెక్కీ' కూడా నిర్వహించారని,తనకు ఏ క్షణంలోనైనా ప్రమాదం జరగొచ్చని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు.తన ప్రాణ భయాన్ని అర్థం చేసుకుని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తక్షణమే పోలీసు రక్షణ కల్పించాలని మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి జిల్లా ఎస్పీని వేడుకున్నారు.దీనిపై స్పందించిన ఎస్పీ విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ సేవలు శిరస్మరణీయం:ఆర్ఎస్ఎస్

**- గురుపూజోత్సవంలో ముఖ్య అతిథి దుగ్గిరెడ్డి ఓబుల్‌రెడ్డి**





**చెన్నూరు మన జనప్రగతి జూలై 11:**-ప్రకృతి వైపరీత్యాలు, వరదలు వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలుస్తూ సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సేవలు శిరస్మరణీయమని మైదుకూరు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ దుగ్గిరెడ్డి ఓబుల్‌రెడ్డి (భరత్) అన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చెన్నూరు ఖండ ఆధ్వర్యంలో శనివారం చెన్నూరులోని ప్రధాన రామాలయంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నిర్మాణకర్తలు, గురువులకు పూలమాలలు సమర్పించి నివాళులర్పించిన అనంతరం సంఘ్ పతాకావిష్కరణ చేపట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దుగ్గిరెడ్డి ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ,1925లో స్థాపించబడిన ఆర్ఎస్ఎస్ దేశభక్తి, క్రమశిక్షణ,సేవాభావం అనే విలువలతో సమాజానికి విశేష సేవలు అందిస్తోందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర పరిస్థితులు, సామాజిక సేవా కార్యక్రమాల్లో స్వయంసేవకులు నిస్వార్థంగా సేవలందిస్తూ దేశ భద్రత, జాతీయ సమైక్యతకు తమ వంతు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చెన్నూరు ఖండ సంఘ్ బాధ్యులు పసుపులేటి సుబ్రహ్మణ్యం, ముఖ్య వక్త రాచమల్ల జగదీశ్వర ప్రసాద్,రాము, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో స్వయంసేవకులు, ప్రముఖులు, స్థానికులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ తప్పనిసరి ధరించాలి

**• వేంపల్లె సీఐ టి.నరసింహులు**

**• రోడ్డు బద్రత నియమాలపై అవగాహన**



**వేంపల్లె మన జనప్రగతి జులై 11:**-రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు తప్పనిసరి హెల్మెట్ ధరించాలని వేంపల్లె సీఐ టి.నరసింహులు సూచించారు. శనివారం పలు ప్రాంతాల్లో రోడ్డు బద్రత నియమాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనదారుడు ఇంటి నుంచి బయటకు వచ్చే సందర్భాల్లో హెల్మెట్, వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహాయ పడాలని వెల్లడించారు. అలాగే అతి వేగం ప్రమాదకరమని రోడ్డు బద్రత నియమాల పట్ల శ్రద్ధ వహించాలని కోరారు. లేని పక్షంలో చట్టపరమైన చర్యలు, జరిమానా తప్పవని హెచ్చరించారు.

# సింగంశెట్టి సుబ్బ రామయ్యను సన్మానించిన తిరుమల హాకర్లు




**తిరుపతి మన జనప్రగతి జులై 11 :-** తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బారామయ్యను శనివారం తిరుమలకు చెందిన హాకర్లు శాలువాతో ఘనంగా సత్కరించారు. తిరుమలలో ఉన్న హాకరులకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు సుబ్బరామయ్య దగ్గరకు వెళ్లి విన్నవించుకునేవారు. ఆయన వెంటనే స్పందించి సంబంధిత ప్రజాప్రతినిధుల దృష్టికి, టీటీడీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా చొరవ చూపుతో వారికి పూర్తి సహాయ సహకారాలు అందించేవారు. నేపథ్యంలో సింగంశెట్టి సుబ్బరామయ్యను తిరుమల కు చెందిన జంపాల సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, మునుబ్రహ్మణ్యం, సురేంద్ర రాజు, భాస్కర్, సురేష్ హాకర్లు ఉష చిట్టెమ్మ హేమలత శివ లు శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

# జాతీయలోక్ అదాలత్‌లో 62225 కేసులు పరిష్కారం




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జులై 11:**జాతీయ,రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ప్రధాన న్యాయమూర్తి జి. కబర్థి ఆధ్వర్యంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో ఉమ్మడి కర్నూలు,నంద్యాల జిల్లాలలో 62,225 కేసులు పరిష్కారం అయ్యాయి. 200 మోటార్ ఆక్సిడెంట్ కేసులలో 15,11,43,507/- బాధితులకు నష్టపరిహారంగా ఇన్సూరెన్స్ కంపెనీల నుండి ఇప్పించడం జరిగినది. శ్రీశైలం ప్రాజెక్టు భూసేకరణలో నష్టపోయిన 96 మంది రైతుల వారసులకు =o. 42,00,000/- రూపాయలు నష్టపరిహారంగా ఇప్పించడం జరిగింది. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ మొత్తం రెండు జిల్లాల్లో 31 బెంచీలను ఏర్పాటు చేసి 548 సివిల్ కేసులు, 61292 క్రిమినల్ కేసులు, బ్యాంకు కేసులు 289 పరిష్కరించామని తెలిపారు.ఈ సమావేశంలో సిబిఐ కోర్ట్ అదనపు జిల్లా జడ్జి శోభా రాణి,ఆరవ అదనపు జిల్లా జడ్జి వాసు,ఏడవ అదనపు జిల్లా జడ్జి లక్ష్మి రాజ్యం, శాశ్వత లోకదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్,కర్నూలు బార్ ప్రసిడెంట్ చంద్రుడు,రిటైర్డ్ అదనపు జిల్లా జడ్జి లక్ష్మినరసింహారెడ్డి,ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మల్లేశ్వరి,మరియు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సంధ్యా రాణి, రెండో అదనపు జూనియర్ సివిల్ సరోజనమ్మ, ఎక్సైజ్ కోర్టు జడ్జి అనిల్ కుమార్, మొబైల్ కోర్టు జడ్జి అనూష, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి అపర్ణ,కోర్టుమా నిటరింగ్ సి ఐ. రామానాయుడు, న్యాయ వాదులు, బ్యాంక్ అధికారులు, బి యస్ యన్ యల్ అధికారులు, పంచాయతీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# క్రాంతి నగర్, బొమ్మల సత్రంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

**• టీడీపీ రాష్ట్ర నాయకులు ఎన్ఎండి ఫయాజ్**



**నంద్యాల, మన జనప్రగతి జులై 11:** నంద్యాల పట్టణంలోని క్రాంతి నగర్ మరియు బొమ్మల సత్రం ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో ముఖాముఖి మాట్లాడి, ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం, రహదారులు దెబ్బతినడం, తాగునీటి ఎద్దడి మరియు వీధి దీపాల లోపం వంటి సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రజా సమస్యలపై స్పందించిన ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తాము క్షేత్రస్థాయిలో గమనించామని, ఈ సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన అభివృద్ధి పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో 32 వార్డ్ టీడీపీ ఇంచార్జి కొండ శ్రీనివాస్ యాదవ్, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


# జనసేనాని త్వరగా కోలుకోవాలి

**-సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో పాల్గొనాలి**

**శ్రీ కాశీ విశాలాక్షి అమ్మవారిని శ్రీ వాసవీ మాత ను ప్రార్థిస్తున్నాం:**

**నంద్యాల జిల్లా జనసేన నాయకుడు భవనాశి వాసు**

**నంద్యాల, మన జనప్రగతి జులై 11:** జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ శస్త్రచికిత్స అనంతరం త్వరగా కోలుకుని, మునుపటి ఉత్సాహంతో తిరిగి ప్రజాసేవలో పాల్గొనాలని నంద్యాల జిల్లా జనసేన నాయకులు భవనాశి వాసు ఆకాంక్షించారు. జనసేనాని శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భవనాశి వాసు మాట్లాడుతూ.. తమ అధినేత సంపూర్ణ ఆరోగ్యంతో, సురక్షితంగా ఉండాలని ఆ కాశీ విశాలాక్షి శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని మనసారా వేడుకుంటున్నట్లు తెలిపారు. ప్రజల పక్షాన నిరంతరం పోరాడే పవన్ కళ్యాణ్ త్వరలోనే పూర్తిస్థాయి ఆరోగ్యవంతులై, రెట్టించిన ఉత్సాహంతో తిరిగి రావాలని కోరుకుంటూ, "ఐ విష్ యూ ఫుల్ అండ్ స్పీడీ రికవరీ సార్" అని తన సందేశాన్ని తెలియజేశారు.




# జూలై 14లోగా ఎన్యూమరేషన్ ఫారమ్‌లు సమర్పించాలి

**ప్రత్యేక డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకొని ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలి**

**అర్హులందరి పేర్లు ఓటరు జాబితాలో ఉండేలా ప్రతి ఒక్కరూ సహకరించాలి**

**జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**




**నంద్యాల, మన జనప్రగతి జులై 11:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్-2026) కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రతి అర్హత కలిగిన ఓటరు తన ఎన్యూమరేషన్ ఫారమ్‌ను తప్పనిసరిగా సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. జూలై 14తో ఈ ప్రత్యేక కార్యక్రమం ముగియనున్నందున మిగిలిన రోజులను సద్వినియోగం చేసుకొని ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆమె కోరారు. శనివారం వీడియో సందేశం ద్వారా జిల్లా ప్రజలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, నంద్యాల జిల్లాలో ప్రస్తుతం 14,05,443 మంది ఓటర్లు నమోదై ఉన్నారని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం, విశ్వసనీయతను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని చేపట్టిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవెల్ అధికారులు ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి రెండు ఎన్యూమరేషన్ ఫారమ్‌లను అందజేస్తున్నారని తెలిపారు. ఒక ఫారమ్‌ను ఓటరు స్వీకరించినట్లు అక్నాలెడ్జ్ చేయగా, రెండవ ఫారమ్‌ను అవసరమైన వివరాలతో పూరించి తిరిగి బూత్ లెవెల్ అధికారులకు అందజేయాల్సి ఉంటుందని వివరించారు. అందిన ఫారమ్‌లన్నింటినీ డిజిటలైజ్ చేసి తుది ఓటరు జాబితా తయారీకి వినియోగిస్తామని తెలిపారు. ఫారమ్‌ను తిరిగి సమర్పించని పక్షంలో సంబంధిత ఓటరు పేరు రాబోయే డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్‌లో నమోదు కాకపోయే అవకాశం ఉందని స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 10,90,722 ఎన్యూమరేషన్ ఫారమ్‌లు ఓటర్ల నుంచి తిరిగి అందగా వాటిని విజయవంతంగా డిజిటలైజ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే బూత్ లెవెల్ ఏజెంట్ల సహకారంతో మరణించిన వారు, డూప్లికేట్ నమోదులు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్లను గుర్తించి, అలాంటి 55,449 ఫారమ్‌లను కూడా డిజిటలైజ్ చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఇంకా 2,59,272 ఎన్యూమరేషన్ ఫారమ్‌లు ఓటర్ల నుంచి అందాల్సి ఉందన్నారు. మిగిలిన ఫారమ్‌ల సేకరణను వేగవంతం చేసేందుకు శనివారం, ఆదివారం జిల్లావ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో బూత్ లెవెల్ అధికారులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. జూలై 14 గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి ఓటరు బాధ్యతగా స్పందించి తమ ఎన్యూమరేషన్ ఫారమ్‌ను వెంటనే సంబంధిత బూత్ లెవెల్ అధికారికి అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విజ్ఞప్తి చేశారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, బూత్ లెవెల్ ఏజెంట్లు, అధికారులు సమిష్టిగా సహకరించాలని కోరారు. పారదర్శకమైన, సమగ్రతతో కూడిన, తప్పులులేని ఓటరు జాబితా రూపకల్పనలో ప్రతి ఓటరి భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు విలువైనదని కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు.

# ఎస్ఐఆర్ - 2026 ప్రక్రియను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలి

**ఎన్యూమరేషన్ ఫారమ్‌ల డిజిటలైజేషన్‌లో ఖచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి**

**పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల, మన జనప్రగతి జులై 11:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నంద్యాల జిల్లాలో చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్-2026) కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోగా వేగవంతంగా, పారదర్శకంగా, నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం నంద్యాల పట్టణంలోని ఎం.ఎస్. నగర్ ప్రాంతంలో కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారమ్‌ల డిజిటలైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 111 నుంచి 115 వరకు, అలాగే 125వ పోలింగ్ స్టేషన్ పరిధిలో చేపడుతున్న డిజిటలైజేషన్ పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించి, నమోదు ప్రక్రియ, డేటా అప్‌లోడ్ విధానం, పత్రాల ధృవీకరణ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. డిజిటలైజేషన్ ప్రక్రియలో ప్రతి ఎన్యూమరేషన్ ఫారమ్‌ను అత్యంత జాగ్రత్తగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఓటర్ల వివరాల నమోదులో ఖచ్చితత్వం అత్యంత కీలకమని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ఎన్నికల జాబితాపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రతి దశలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. అనంతరం నంద్యాల పట్టణంలోని 108, 149 నుంచి 152 వరకు ఉన్న పోలింగ్ కేంద్రాలను కూడా జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడ కొనసాగుతున్న ఎస్ఐఆర్-2026 కార్యక్రమం అమలు తీరును పరిశీలించి, ఎన్యూమరేషన్ ఫారమ్‌ల సేకరణ, డిజిటలైజేషన్, రికార్డుల నిర్వహణ, పెండింగ్ వివరాల పరిష్కారం వంటి అంశాలపై అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఎన్యూమరేషన్ ఫారమ్‌ల డిజిటలైజేషన్‌ను నిర్దేశించిన కాలపట్టిక ప్రకారం వేగవంతం చేయడంతో పాటు, ప్రతి నమోదును క్షుణ్ణంగా పరిశీలించి మాత్రమే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఫీల్డ్ స్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేసి, ప్రతిరోజూ నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని, పెండింగ్ లేకుండా ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. ఎస్ఐఆర్-2026 కార్యక్రమం విజయవంతం కావడానికి అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తు.చ తప్పకుండా అమలు చేస్తూ ప్రజలకు పారదర్శకమైన, విశ్వసనీయమైన ఓటరు జాబితా అందించే దిశగా కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. ఈ తనిఖీలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, నంద్యాల అర్బన్ తహశీల్దార్ శ్రీనివాసులుతో పాటు సంబంధిత ఎన్నికల శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గడివేముల మండలంలో రైతులందరూ పంటలకు బీమా చేయించుకోవాలి

**గడివేముల:మన జనప్రగతి జులై 11:** ఖరీఫ్ కాలంలో సాగు చేసిన పంటలకు భీమా చేయించుకోవాలని గడివేముల మండల వ్యవసాయ అధికారి జి. కే. పవన్ కుమార్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఖరీఫ్ కాలంలో సాగు చేసిన పంటలకు ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ భీమా మరియు వాతావరణ ఆధారిత భీమా ను వివిధ పంటలకు వర్తింప చేస్తూ మార్గదర్శకాలు విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ భీమా పథకం లో వరి గ్రామం యూనిట్ గా, మొక్కజొన్న, మినుము, కంది, మిరప మండలం యూనిట్ గా, సజ్జ, కొర్ర, ఉల్లి, ఆముదం, జొన్న జిల్లా యూనిట్ గా ఉన్నదని, వరికి ఎకరాకు 800/-, మొక్కజొన్న కు 660/-, కంది కి 400/-, మినుము మరియు జొన్నకు 190/-, సజ్జ మరియు ఆముదం పంటలకు 160/-, ఉల్లికి 450/- , మిరపకు 2880/- ప్రీమియం చెల్లించి రైతులు పంటల భీమా పథకం లో నమోదు చేసుకోవచ్చునని, అలాగే, వరికి ఆగస్టు 15వ తేదీ వరకు మరియు ఇతర పంటలకు జూలై 31 వరకు గడువు ఉన్నదని తెలిపారు. అలాగే వాతావరణ ఆధారిత భీమా పథకం లో వేరుశనగ, ప్రత్తి మరియు అరటి పంటలు పొందు పరచటం జరిగిందని , వేరుశనగ కు ఎకరాకు 560/-, ప్రత్తి కి 1600/- మరియు అరటికి 2750/- రూపాయలు ప్రీమియం గా చెల్లించి జూలై 15 వ తేదీలోగా రైతులు నమోదు చేసుకోగలరని తెలిపారు. ఇంకా పూర్తి వివరాలకు రైతులు వారి సమీపంలోని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని కలవాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో పంటల బీమా పథకం రైతులకు ఎంతో మేలు చేస్తుందని రైతులకు రైతులకు తెలియజేస్తున్నాము. గని గ్రామంలో పంటల బీమా మీద పంట బీమా ఇన్సూరెన్స్ సిబ్బందితో కలిసి రైతులకు పంట బీమా పథకం మీద అవగాహన కల్పించడం జరిగింది. **సబ్సిడీలో మినుము విత్తనాల పంపిణీ:** ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ప్రోత్సహించడానికి పల్స్ మిషన్లో భాగంగా ప్రభుత్వం సబ్సిడీ పై ఎదీచీ 9 రకం మినుములు పంపిణీ చేయడం జరుగుతుందని, ఇందుకు గాను గడివేముల మండలమునకు 40 క్వింటాలు కేటాయించడం జరిగిందని, వీటిని మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని, పూర్తి ధర: కిలో 129.5/-, సబ్సిడీ 60/- , రైతు వాటా: 69.5/- చెల్లించి మినుములు పొందగలరని వ్యవసాయ అధికారి తెలిపారు. **APAIMS యాప్ ద్వారా ఎరువుల సరఫరా** APAIMS యాప్ ద్వారా రైతులకు ఎరువులు సరఫరా జరుగుతుంది. ఓటిపి ద్వారా మాత్రమే కాకుండా ఫేస్ మరియు బయోమెట్రిక్ ఆథెంటికేసన్ ద్వారా ఎరువులు ఇవ్వడం జరుగుతుంది. దీని ద్వారా రైతులు సులభంగా ఎరువులు పొందవచ్చు. గ్రాజా గడివేముల, రైతు సేవా కేంద్రాలు మరియు ప్రైవేటు దుకాణాల వద్ద తగినంత యూరియా, డి ఏ పి మరియు ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందిని మండల వ్యవసాయ అధికారి తెలిపారు.



# కరోనాకు అడ్డుకట్ట వేయండి

**కలెక్టర్, డీఎంహెచ్ వోకు ఫోన్లో జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత ఆదేశం**

**కేసులు నమోదైన ప్రాంతాల్లో కొవిడ్ నిబంధనలు అమలు చేయండి**

**రద్దీ ప్రాంతాల్లో మాస్క్ ధరించడం తప్పనిసరి చేయండి**

**వియత్నాంలో కడప వాసి దుర్మరణంపై మంత్రి సవిత దిగ్భ్రాంతి**

**బాధిత కుటుంబానికి అండగా ఉంటాం**

**ఎప్పటికప్పుడు విదేశాంగ అధికారులతో మాట్లాడుతున్నాం : మంత్రి సవిత**



**కడప అర్బన్ మన జనప్రగతి జూలై 11:–** జిల్లాలో కరోనా మహమ్మారి వ్యాప్తి చెందకుండా అడ్డుకట్ట వేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత ఆదేశించారు. అదే సమయంలో కరోనా నివారణపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, కొవిడ్ –19 నిబంధనలు అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ ను, డీఎంహెచ్ వో రవిబాబును ఫోన్లో ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. కడపలో ఎనిమిది కరోనా కేసులు నమోదు కావడమే కాకుండా ఇద్దరు మృతి చెందడంపై జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత ఆందోళన వ్యక్తంచేశారు. తక్షణమే కరోనా కేసులు నమోదైన ప్రాంతాల్లో కొవిడ్ –19 నిబంధనలు అమలు చేయాలని ఆదేశించారు. స్థానికుల్లో కరోనా నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రద్దీగా ఉండే ప్రదేశాలు, ఆసుపత్రుల వద్ద మాస్క్ లు వాడకం తప్పనిసరి చేయాలన్నారు. జ్వరం, దగ్గు, ఇతర కోవిడ్ లక్షణాలున్న వారిని గుర్తించి ఐసోలేషన్ వార్డుకు తరలించాలన్నారు. కలెక్టర్ శ్రీధర్, డీఎంహెచ్ వో రవిబాబు మాట్లాడుతూ, ఎనిమిది కరోనా కేసులు మినహా కొత్తగా కేసులు నమోదు కాలేదన్నారు. ప్రస్తుత కరోనా వెరియంట్ వ్యాప్తిపై శాంపిళ్లను పూణే ల్యాబ్ కు పంపామన్నారు. ప్రస్తుతం నమోదైన కరోనా వేగ వంతంగా వ్యాప్తి చెందుతుందా... నెమ్మదిగా సోకు తుందా..? అనేది ల్యాబ్ నుంచి వచ్చే రిపోర్టులో వెల్లడ వుతుందన్నారు. ఇప్పటికే కరోనా కేసులు నమోదైన ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టామని, బ్లీచింగ్ వెదజల్లామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, కరోనా నమోదైన కుటుంబాల్లో సభ్యులకు కూడా తక్షణమే పరీక్షలు నిర్వహించి, పాజిటివ్ నమోదయితే వారిని కూడా ఐసోలేషన్ వార్డుకు తరలించాలన్నారు. నెగిటివ్ వస్తే... కొద్ది రోజుల పాటు వారి ఇళ్లల్లోనే ఐసోలేషన్ లో ఉంచాలని తెలిపారు. మరో మరణం సంభవించకుండా, ప్రస్తుతం ఐసోలేషన్ వార్డులో ఉన్నవారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మేరకు కోవిడ్–19 టీకాలు అందుబా టులో ఉంచాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ ను, డీఎంహెచ్ వో రవిబాబుకు మంత్రి సవిత ఫోన్లో స్పష్టం చేశారు. **వియత్నాం బాధిత కటుంబానికి అండగా ఉంటాం** వియత్నాం సందర్శనకు వెళ్లిన కడప వాసి, ఆ దేశంలో జరిగిన బోటు ప్రమాదంలో మృతి చెంద డంపై జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తంచే శారు. ఆ దేశంలో జరిగిన బోటు ప్రమాదంలో ముడి యం శ్రీధర్ సహా 15 మంది మృత్యువాతపడడం బాధాకరమన్నారు. సంతోషంగా ముగియాల్సిన విదేశీ టూర్ విషాదంగా ముగియడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సాను భూతిని మంత్రి వ్యక్తంచేశారు. శ్రీధర్ కుటుం బానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుం దని చెప్పారు. ఇప్పటికే విదేశాంగ అధికారులతో, ఢిల్లీ భవన్ అధికారులతో మంత్రి నారా లోకేశ్ మాట్లాడా రని తెలి పారు. ఏపీకి చెందిన టూరిస్ట్ లతో పాటు శ్రీధర్ మృత దేహాన్ని కూడా స్వస్థలానికి రప్పిస్తామన్నా రు. ఎప్పటి కప్పుడు వియత్నాం, ఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులతో మాట్లాడుతున్నామని మంత్రి సవిత తెలిపారు.

# గోదావరి పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం: మంత్రి నారాయణ



**రాజమహేంద్రవరం,మన జనప్రగతి జూలై 11:–** వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జూలై 7 వరకు జరిగే గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. శనివారం మంత్రి కందుల దుర్గేశ్తో కలిసి రాజమహేంద్రవరం గోదావరి పుష్కర ఘాట్లను పరిశీలించిన ఆయన, భక్తులకు అవసరమైన సౌకర్యాలు, అభివృద్ధి పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మీడియాతో మాట్లాడుతూ, పుష్కరాల నిర్వహణపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారని, మున్సిపల్ శాఖ నుంచి ఇప్పటికే రూ. 585 కోట్లు కేటాయిం చా మని తెలిపారు. గత పుష్కరాల కంటే ఈసారి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పారిశుధ్యం, భద్రత, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు చెప్పారు. మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పుణ్యస్నానాలు ఆచరించేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

# దళిత యువతిపై దాడి..న్యాయం చేయాలని బాధిత కుటుంబం విజ్ఞప్తి

**- భూమి వివాదం నేపథ్యంలో కక్షతో దాడి చేశారని ఆరోపణ**



**కడప మన జనప్రగతి జూలై 11:–**కొండాపురం మండలం ఎస్. తిమ్మాపురం గ్రామానికి చెందిన దళిత మహిళ రామాంజనేయమ్మ కుమార్తె హన్సికపై జరిగిన దాడి ఘటనపై బాధిత కుటుంబం న్యాయం చేయాలని అధికారులను కోరింది. శనివారం కడప రిమ్స్ ఆసుపత్రిలో విలేకరులతో మాట్లాడిన రామాంజనేయమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. తమకు సంబంధించిన భూమి వివాదం విషయంలో గతంలో పోలీస్ స్టేషన్లో జరిగిన సంఘటనను మనసులో పెట్టుకుని, మాజీ సర్పంచ్ సిరియపు బాబురెడ్డి అనుచరులుగా పేర్కొన్న బుడ్డా శివ హేమంత్, బుడ్డా శ్రీనివాసులు, చిన్నసంటి నాగరాజు, చీమల కృష్ణయ్యతో పాటు మరికొందరు శుక్రవారం ఉదయం తన కుమార్తె హన్సికపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ దాడిలో హన్సిక తీవ్రంగా గాయపడగా, ఆమెను వెంటనే కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే దాడి సమయంలో రెండు సెల్ఫోన్లు, రెండు తాళిబొట్లు కూడా తీసుకెళ్లారని ఆరోపించారు. గతంలో పోలీస్ స్టేషన్లో తమను అవమానించేలా మాట్లాడటం, ఆ విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో ప్రస్తావించడం వల్లే కక్ష పెంచుకుని ఈ దాడికి పాల్పడ్డారని రామాంజనేయమ్మ పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు, జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని తమ కుటుంబానికి న్యాయం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# హంద్రీనీవా జలాలు శ్రీనివాస రిజర్వాయర్‌కు ఎప్పుడొస్తాయి..?

**ప్రభుత్వానికి గ్రేటర్ రాయలసీమ ప్రాజెక్టుల పరిరక్షణ సమితి కోఆర్డినేటర్ శిబ్యాల విజయభాస్కర్.**



**రాయచోటి బ్యూరో మన జనప్రగతి జూలై 11:–**రాయలసీమ అభివృద్ధి గురించి ఎన్నికల సమయంలో గొప్పలు చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ప్రాంతాన్ని మరోసారి నిర్లక్ష్యానికి గురిచేస్తున్నారని, గ్రేటర్ రాయలసీమ ప్రాజెక్టుల పరిరక్షణ సమితి కోఆర్డినేటర్ శిబ్యాల విజయ భాస్కర్, మీడియాతో మాట్లాడుతూ దశాబ్దాలుగా సాగునీరు, తాగునీటి కోసం ఎదురు చూస్తున్న రాయలసీమ ప్రజల ఆశలు నేటికీ నెరవేరకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న రాయలసీమలో ప్రతి ఏడాది రైతుల చావులు,, రైతు కరువుతో, నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడని,ఇలాంటి పరిస్థితుల్లో సాగునీటి ప్రాజెక్టులను వేగవంతం చేయాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చిత్తశుద్ధితో పనిచేయడం లేదనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోందన్నారు. గత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రాయలసీమ శాశ్వత అభివృద్ధే లక్ష్యంగా హంద్రీనీవా, గాలేరునగరి వంటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టి కృష్ణా జలాలను రాయలసీమకు తీసుకురావాలని మహత్తర సంకల్పంతో ముందుకు సాగారన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమానాభివృద్ధే ఆయన ధ్యేయంగా పనిచేశారని, అయితే ఆయన అకాల మరణంతో అనేక ప్రాజెక్టులు మధ్యలోనే నిలిచిపోయాయన్నారు. ప్రాజెక్టులను పూర్తి చేసి రాయలసీమకు నీటి భద్రత కల్పించాల్సిన బాధ్యత తరువాతి ప్రభుత్వాలపై ఉన్నప్పటికీ, పదహారు సంవత్సరాలకు పైగా ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు రాయలసీమకు శాశ్వత ప్రయోజనం చేకూర్చే ఒక్క ప్రధాన సాగునీటి ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదనే విమర్శలు వినిపిస్తున్నాయన్నారు. రాయచోటి సమీపంలోని శ్రీనివాస రిజర్వాయర్ నిర్మాణం పూర్తై సంవత్సరాలు గడిచినా, హంద్రీనీవా ద్వారా నీటిని అందించే పనులు నేటికీ పూర్తికాలేదన్నారు. ఈ రిజర్వాయర్‌కు నీరు చేరితే రాయచోటి, చిన్నమండెం సహా సుమారు ఏడు మండలాల రైతులకు సాగునీరు, లక్షలాది మందికి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. అయినప్పటికీ ఈ అంశంపై ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. మరోవైపు, రెండున్నరేళ్ల క్రితం వరదల్లో దెబ్బతిన్న అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణం కూడా ఇప్పటికీ పూర్తికాలేదని,కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఆ ప్రాజెక్టు పనుల్లో ఆశించిన పురోగతి కనిపించడం లేదన్నారు. ఈ ప్రాజెక్టుపై ఆధారపడిన రైతులు, గ్రామాలు ఇంకా అనిశ్చితిలోనే ఉన్నాయన్నారు. అమరావతి అభివృద్ధి పేరుతో లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం ముందుకొస్తున్న వేళ, అందులో కొంత భాగమైనా రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు కేటాయిస్తే ఈ ప్రాంత భవిష్యత్తు పూర్తిగా మారిపోతుందని, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తయి, రాయలసీమ కరువు సీమ నుంచి సస్యశ్యామలమైన రత్నాలసీమగా రూపాంతరం చెందుతుందన్నారు. రాజకీయ హామీలతో కాలం గడపకుండా, రాయలసీమ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ హంద్రీనీవా, శ్రీనివాస రిజర్వాయర్, అన్నమయ్య ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం సకాలంలో పూర్తి చేసి అన్ని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారన్నారు. అభివృద్ధి ఒక్క ప్రాంతానికే పరిమితం కాకుండా, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సమానంగా కూడా అందినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని రాయలసీమ ప్రజలు స్పష్టం చేస్తున్నారన్నారు, గ్రేటర్ రాయలసీమ ప్రాజెక్టుల పరిరక్షణ సమితి కోఆర్డినేటర్ సిబ్యాల విజయభాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు...

# సోషల్ మీడియాలో తమపై తప్పుడు ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి: కావలిగడ్డ ప్రజలు





**వీరబల్లి మన జనప్రగతి జులై 11:–** సోషల్ మీడియా వేదికగా తమ గ్రామంలో ఉన్న అంగన్వాడి సెంటర్ పై అందులో పని చేస్తున్న మహిళా సిబ్బందిపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వీరబల్లె కు చెందిన ఐ టిడిపి అని చెప్పుకుంటున్న కాల్వపల్లి నాగ వెంకటరమణ, పెదివిటి నరసింహులు, బొంగా వాండ్లపల్లి కు చెందిన రామాంజులు అని వీరు సోషల్ మీడియా వేదికగా తమపై అసత్య ఆరోపణలు చేయడమే కాకుండా తమను మానసికంగా వేధిస్తున్నారంటూ కావలిగడ్డ ప్రజలు అంగన్వాడి కార్యకర్త లు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు వారు ఆ ఫిర్యాదులు తమ గ్రామంలోని అంగన్వాడి సెంటర్ లోని సిబ్బందిని టార్గెట్ చేసి అసభ్యకరంగా పోస్టులు పెట్టడం తమ మనోభావాలను దెబ్బతీసిందని అంతేకాకుండా సెంటర్ వద్దకు వచ్చి చూపించి తమను బెదిరింపు చేశాడని వీరిని ఇలాగే వదిలేస్తే మండలంలో మరిన్ని అరాచకాలు సృష్టించే వారు అవుతారని కనుక నిజా నిజాలు తెలుసుకొని వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకొని మా గ్రామ ప్రజలను రక్షించాల్సిందిగా వారు ఈ వినతి పత్రంలో పేర్కొన్నారు.

# పత్తికొండ రోడ్డు విస్తరణ చేపట్టాలని సీపీఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ,రాస్తారోకో

**పత్తికొండ మన జనప్రగతి జూలై 11:–**పత్తికొండ పట్టణంలో రోడ్డు విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రతి రెండో శనివారం నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంలో భాగంగా శనివారం భారీ బైక్ ర్యాలీ,రాస్తారోకో నిర్వహించారు. స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ పట్టణ ప్రధాన వీధుల మీదుగా అంబేద్కర్ సర్కిల్ చేరుకుని, అక్కడి నుంచి నాలుగు స్తంభాల కూడలి వరకు కొనసాగింది. అనంతరం నాలుగు స్తంభాల కూడలిలో రాస్తారోకో చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, జిల్లా కమిటీ సభ్యుడు వీరశేఖర్ మాట్లాడుతూ పత్తికొండ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రధాన సమస్య రోడ్డు విస్తరణేనని అన్నారు. పట్టణ అభివృద్ధికి రోడ్డు విస్తరణ అత్యవసరమని, అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి పనులు ప్రారంభించాలన్నారు. రోడ్డు విస్తరణపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని, అవసరమైతే జిల్లా కలెక్టర్‌తో పాటు ప్రజాప్రతినిధుల కాన్వాయ్‌లను కూడా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, సీఐటీయూ మండల కార్యదర్శి ఎం. రవిచంద్ర, పార్టీ మండల కమిటీ సభ్యులు రంగారెడ్డి, దస్తగిరి, సురేంద్ర, వెంకటేశ్వర్లు, సిద్ధయ్య గౌడ్, రాజులు, కారప్ప, శికామణి, హమాలీ కార్మిక సంఘం నాయకులు చంద్ర, రామాంజనేయులు, రజక సంఘం జిల్లా నాయకుడు ఈరన్న, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు,




పార్టీ కార్యకర్తలు, పట్టణ ప్రజలు, పెద్ద సంఖ్యలో బైక్ యజమానులు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174